3 . 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 266 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



**లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారికి తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గారితో కలిసి స్వాగతం పలికిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు.**

**హైదరాబాద్ వెలుతురు మార్చి 02:** సోమవారం రోజున హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీసీసీల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనాడానికి విచ్చేసినా లోకసభ ప్రతిపక్ష నేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ గారికి గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గారితో కలిసి స్వాగతం పలికిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు.



# మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి



- బయటపడుతున్న మోదీ దుర్మార్గ చర్యలు
- ఇరాన్ లాంటి దుస్థితి భారత్‌కు రాకూడదు
- మోదీ తీరుతో ప్రమాదంలో దేశ పరిస్థితి
- వికారాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్
- శంషాబాద్‌లో రాహుల్‌కు స్వాగతం పలికిన రేవంత్

## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

- అందుకోసం కలిసికట్టుగా పనిచేద్దాం
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం
- డిసిసి అధ్యక్షులు శిక్షణ శిబిరం ముగింపులో సిఎం రేవంత్

**వికారాబాద్, మార్చి2 వెలుతురు:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ



## పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

- అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడికి మోదీ ఫోన్



**న్యూఢిల్లీ,మార్చి2 :** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్



## రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- రంగుల పండుగ హోలీ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని కాంక్షించిన మంత్రి

# రాజ్యసభకు మరో రెండురోజులే గడువు



- వికారాబాద్ సభలో రాజ్యసభ ప్రస్తావన
- సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక
- సంఘ్విని తమిళనాడు నుంచి పంపాలని సూచన

**వికారాబాద్,మార్చి2 వెలుతురు:** రాజ్యసభ నామినేషన్లకు మరో రెండు రోజుల గడువే ఉంది, ఈ రెండు స్థానాలను బలం రీత్యా కాంగ్రెస్ గెలచుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు అబ్యర్థులను ఖరారు చేయలేదు. వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగిందని సమాచారం. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే

# ఇగోలు పక్కన పెట్టి పనిచేయండి

- ఒక్కొక్కరు మరో పదిమంది లీడర్లను తయారు చేయాలి
- మార్క్ ఆర్ట్ రూపంలో క్లాస్ చెప్పిన రాహుల్ గాంధీ
- రాహుల్‌ను ప్రత్యేకంగా కలిసిన సీతక్క



**వికారాబాద్,మార్చి2 వెలుతురు:** ఇగోల కంటే పార్టీ ముఖ్యమని స్పష్టం రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు



## రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

- మంత్రి పొన్నం ప్రభాకర్

# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

- క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత

**హైదరాబాద్,మార్చి2 వెలుతురు:**



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా

# రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వం గోసపెడుతుంది...

- గ్రాట్యుటీ, కమ్యూటేషన్, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరు డీఏలు ఇప్పటికీ చెల్లించని పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వైఫల్యాన్ని స్పష్టం చేస్తుంది...
- బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి...



**హైదరాబాద్ వెలుతురు మార్చి 02:** రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంగోసపెడుతుందని,గ్రాట్యుటీ, కమ్యూటేషన్, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరు డీఏలు ఇప్పటికీ చెల్లించని పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వైఫల్యాన్ని స్పష్టం చేస్తుందని బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

# సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

- ఇ-వేలంలో భారీగా అక్రమాలు
- వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి
- సిఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్,మార్చి2 వెలుతురు:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## బఫర్ జోన్, ఎఫ్ టీఎల్ పేరుతో ఇకపై పేదల ఇండ్లు మీరు కూలిస్తే...

# అదే ప్రాంతంలోని పెద్దల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చి వేస్తాం



- శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమైతే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఒవైసీ అక్రమంగా నిర్మించిన ఫాతిమా కాలేజీ కూల్చడానికి పరీక్షలు అడ్డు వస్తే....
- ఖమ్మంలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల భవిష్యత్తు గుర్తుకురాలేదా?
- పేదలకు ఒక న్యాయం... ఒవైసీ కాలేజీకి మరో న్యాయమా?
- హిందూ దేవాలయాలపై దాడులు చేస్తూ అమాయకులను వేధిస్తున్నారా?



- ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే బాన్సువాడలో హిందువులను జైల్లో వేస్తారా?
- హిందువులారా... ఇంకెన్నాళ్లు కాంగ్రెస్, మజ్లిస్ అరాచకాలను భరిద్దాం?
- హిందువులంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం రండి

# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

- ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి
- బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచన



**అమరావతి,మార్చి2 వెలుతురు:** ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి

వెలుతురు

## ప్రజలకు,గవర్నర్, సిఎం హోళీ శుభాకాంక్షలు

**హైదరాబాద్,మార్చి2 వెలుతురు:**
తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హోళీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోళీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోళీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోళీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు. అలాగ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజల్లో రంగులు నింపాలని కోరుకున్నారు.

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ - 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్షెప్సన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.

## ఇగోలు పక్కన పెట్టి పనిచేయండి

చేయాలని, పని చేస్తున్న వారిని గుర్తించాలని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియా ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ అగ్రనేత వివరించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. అనంతగిరి హరితా రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. మార్షల్ ఆర్ట్స్ చేస్తూ డీసీసీ అధ్యక్షులకు క్లాస్ చెప్పారు రాహుల్. జియు జిట్సు అనే మార్షల్ ఆర్ట్‌లో మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఐడియాలజీపై క్లాస్ చెప్పారు. నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పని చేయాలని రాహుల్ సూచించారు. పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని.. ఇరాన్ వెనక చైనా, రష్యా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ పూర్తిగా సరెండర్ అయ్యారని.. ట్రంప్‌కు వ్యతిరేకంగా మోదీ పని చేయలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు ముగియడంతో వికారాబాద్ నుంచి హెలికాప్టర్‌లో శంషాబాద్ వెళ్ళారు. అక్కడి నుంచి ఏఐసీసీ అగ్రనేత ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఇదిలావుంటే లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వికారాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని హరిత రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల 10 రోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆయనతో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిసింది.

### రాష్ట్ర ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 02:**
రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండుగ హోళీ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ పండుగ మన సమాజంలో సోదరభావాన్ని,ప్రేమాభిమానాలను పెంపొందించాలని ఆయన కోరారు. అందరూ కలిసి జరుపుకునే ఈ రంగుల పండుగ మన సంస్కృతికి, ఐక్యతకు నిదర్శనమని, రసాయన రంగులకు దూరంగా ఉండి, ప్రకృతి సిద్ధమైన రంగులతో పర్యావరణానికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ హోళీ, ప్రతి ఇంటిలో సుఖసంతోషాలను, సిరిసంపదలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సురక్షితంగా, ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

## రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

**హైదరాబాద్ వెలుతురు మార్చి 02:**
రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ పండుగ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ మన సంస్కృతిలో స్నేహం, సౌహార్దం, ఆనందానికి ప్రతీక. రంగులలా మన జీవితాలు సంతోషాలతో నిండాలని, ప్రతి ఇంట్లో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షించారు.మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ఈ సందర్భంలో, అందరం కలిసికట్టుగా సామరస్యంతో ముందుకు సాగుదామని ,ద్వేషాలకు తావులేకుండా ప్రేమ, పరస్పర గౌరవంతో సమాజాన్ని మరింత బలపరచుదామని పిలునిచ్చారు. సహజసిద్ధమైన రంగులు , సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు.హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వేయికోట్లు వసూలుకు వచ్చారా

**- రాహుల్ రాకపై కెటిఆర్ ఎద్దేవా**

**హైదరాబాద్,మార్చి2 వెలుతురు:**
లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.

# మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి

సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతకుముందు ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య, బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసి వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

### రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వం గోసపెడుతుంది...

అన్నారు.రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై ఇందిరాపార్క్-ధర్నా చౌక్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలో బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు: తెలంగాణ రాష్ట్రంలో సుమారు 3.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, 2.8 లక్షల రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. మొత్తం 6.4 లక్షల మందికి సంబంధించిన ఎరియర్స్ సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి.కోర్టుల ఒత్తిడి భయంతో ఇటీవల ఒక్క డీఏ ప్రకటించడం తప్ప, ఉద్యోగులు-రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి లేదు.రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక అనేక మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ రిటైర్డ్ ఎస్సై మరణించిన వార్త కలిచివేసింది.రాష్ట్రంలో అనేక మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదనతో మృతి చెందారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారం గురించి కనీసం ఆలోచించడం లేదు. వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు, గుత్తేదారులకు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ రాష్ట్రానికి సేవ చేసిన ఉద్యోగుల బకాయిలు చెల్లించాలనే బాధ్యతను విస్మరిస్తోంది.అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ మూడు డీఏలు వెంటనే క్లియర్ చేస్తామని, పీఆర్సీ ప్రకటిస్తామని హామీలు ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదు.ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లింపులు చేస్తే కమీషన్లు రావన్న దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలను పక్కన పెట్టిందని స్పష్టంగా కనిపిస్తోంది.రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబాలతో ప్రశాంతంగా జీవించాల్సిన వయసులో, వైద్యం కోసం కూడా ఇబ్బందులు పడే పరిస్థితి కాంగ్రెస్ పాలనలో ఏర్పడింది.సిగ్గు లేకుండా తన పదవి కాపాడుకోవడం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తానని అంటున్నారు. కానీ రాష్ట్రానికి సేవ చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. ఇది కాంగ్రెస్ పాలన యొక్క అసలు స్వరూపం.రాబోయే ఎన్నికల కోసం డబ్బులు జమ చేయడమే ఈ ప్రభుత్వానికి ఏకైక లక్ష్యంగా మారింది. వెయ్యి కోట్లు సరిపోవు, రెండువేల కోట్లు కావాలన్నట్టుగా, రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తే-గాంధీ కుటుంబానికి నిధులు సమకూర్చడంపైనే సీఎం దృష్టి పెట్టారు. కాని రాష్ట్ర ప్రజల సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగుల బాధలు వారికి కనిపించడం లేదు. ఈ డబ్బుల కోసమే ధరణిని తీసేసి, భూభారతి పేరుతో వేల కోట్ల రూపాయలు వసూలు చేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ అక్రమాలన్నిటిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాల్సిందే. ఈ అంశాలన్నింటిపై మేము తప్పకుండా చిట్టా తీస్తాం, రేపు అసెంబ్లీలో బలంగా ప్రస్తావిస్తాం. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం బీజేపీ పోరాటం ఆగదు. ఈ అన్యాయాలపై ప్రజల తరఫున గళమెత్తుతూనే ఉంటామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు

# పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణలు, డ్రోన్ దాడులపై విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ఫోను చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు. కాగా, దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోనులో మాట్లాడారు. ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహరాల క్యాబినెట్ కమిటీ భేటీకి కూడా మోదీ అధ్యక్షత వహించారు. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాల, ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై సమావేశంలో చర్చించారు. సంభాషణకు సంబంధించి ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా కీలక విషయాలను పంచుకున్నారు. యూఏఈ అధ్యక్షుడిని తన 'సోదరుడు' అని సంబోధిస్తూ, అక్కడ జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యంగా యూఏఈలో నివసిస్తున్న భారతీయ సమాజం భద్రత పట్ల ఆ దేశం చూపుతున్న శ్రద్ధకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అత్యవసరంగా భేటీ అయ్యింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా తలెత్తే రాజకీయ మరియు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలపై ఈ కమిటీ కసరత్తు చేసింది.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్ మరియు నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దేశ భద్రతకు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే ఈ కమిటీ, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ అనుసరించాల్సిన విదేశాంగ విధానం మరియు అంతర్జాతీయ వేదికలపై వినిపించాల్సిన స్వరంపై స్పష్టతనిచ్చింది. యుద్ధం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని కనిష్ఠం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు.టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు.ప్రస్తుత వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర , పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితి లో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు.

## రాజ్యసభకు మరో రెండురోజులే గడువు



అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది. ÷రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదీ: మార్చి 5 కావడంతో ఎంపిక త్వరగా చేయాలని ఒత్తిడి పెంచారు.



## లక్ష్మీదేవిపల్లి రైతుల ఆందోళన

**సిద్ధిపేట,మార్చి2( వెలుతురు):**
సమస్యల పరిష్కారానికి సిద్ధిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో అన్నదాతలు రోడ్డెక్కారు. సిద్ధిపేట - ముస్తాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. అలాగే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ద్వారా సాగుకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ ధర్నాలో నారాయణపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు రైతులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు.




# క్రీడాకారులకు ఆర్థిక సాయం,

- ఇతర ప్రోత్సాహకాల అందచేత
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నాం
- ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం అండ
- మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష

హైదరాబాద్,మార్చి2( వెలుతురు):

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 2026-2027 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకు వచ్చి క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ఆటల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. అందులో భాగంగా క్రీడా శాఖకు 2026-2026 బ్జడెట్ లో అధిక నిధుల కేటాయింపుతో పాటు, క్రీడాకారులకు ఆర్థిక సహాయంపై అధికారులతో చర్చించారు. ఒలంపిక్, పారా ఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ ఆటల పోటీల్లో పతకాలు సాధిందించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బ్జడెట్ లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సహంతోనే విద్యార్థి, యువకులు క్రీడల్లో రాణిస్తారని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. క్రీడాకారులకు ఇచ్చే పారితోషికాలపై విధివిధానాలు రూపొందించాలని, వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఓఆ సోనీ బాలాదేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళా భద్రత, సాధికారతకు సమగ్ర కార్యాచరణ

- సచివాలయంలో పలు కీలక శాఖలతో మంత్రి సీతక్క విస్తృత సమీక్ష
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మరిన్ని సంక్షేమ పథకాల వరాలు
- స్పష్టం చేసిన మంత్రి సీతక్క







హైదరాబాద్ వెలుతురు మార్చి 02:
రాష్ట్ర సచివాలయంలో మహిళల భద్రత, సంక్షేమం, సాధికారత కోసం అవలంబించాల్సిన నూతన విధానాలపై పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క పలు కీలక శాఖల ఉన్నతాధికారులతో విస్తృత సమీక్షా సమావేశం సోమవారం నాడు నిర్వహించారు. మహిళా భద్రతను మరింత సమగ్రంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశానికి ఉన్నతాధికారులు సంజయ్ కుమార్, శికా గోయల్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, ప్రియాంకా వర్గీస్, శృతి ఓజా, దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ క్రైమ్ నియంత్రణ చర్యలు సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికీ, విద్యాసంస్థలు, హాస్టళ్లు, కార్యాలయాలు, రాత్రి వేళల ప్రయాణాలు, డిజిటల్ వేదికలు, అసంఘటిత రంగం వంటి విభిన్న రంగాల్లో ఇంకా వ్యవస్థాపరమైన లోపాలు ఉన్నాయని సమావేశం అభిప్రాయపడింది. వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా భద్రతను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా మౌలిక వసతులు, సాంకేతికత, అవగాహన, పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలనల సమన్వయంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల రక్షణ కోసం విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థల్లో,కంపెనీల్లో ఐసీసీ (Internal Complaints Committee) కమిటీలకు తప్పనిసరి ఆడిట్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. రాత్రి 8 గంటల తర్వాత మహిళా ఉద్యోగులకు జీపీఎస్ అనుసంధానిత సురక్షిత రవాణా విధానం ఉండాలని సూచించారు. అసంఘటిత రంగ మహిళల కోసం ప్రత్యేక నమోదు, గుర్తింపు కార్డు, ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రజా రవాణాలో సీసీటీవీ పర్యవేక్షణను బలోపేతం చేసి పీక్ అవర్స్‌లో భద్రతా ఆడిట్లు నిర్వహించాలని నిర్ణయించారు. సైబర్ మార్ఫింగ్, స్టాకింగ్, బ్లాక్‌మెయిల్ వంటి నేరాలపై వేగంగా స్పందించడంతో పాటు బాధితులకు కౌన్సెలింగ్ కల్పించాలన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగ మహిళల రక్షణకు ప్రత్యేక విధానాలు రూపొందించాలన్నారు.

గృహ హింస కారణంగా ఒంటరిగా మిగిలిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో రుణాలు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆశ్రయ గృహాలు, హాస్టళ్ల భద్రతపై డిజిటల్ పర్యవేక్షణ ప్రోటోకాల్ అమలు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు సంబంధించి హెం, మహిళా శిశు సంక్షేమ, విద్య, కార్మిక, రవాణా, మున్సిపల్ పరిపాలన, ఐటి, ఆరోగ్య శాఖల సమన్వయంతో రాష్ట్ర స్థాయి మహిళా భద్రత కన్వర్జెన్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ సిద్దం చేయాలని, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్స్ చట్టపరమైన రక్షణతో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లైంగిక వేధింపుల కేసుల పురోగతిపై పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల కోసం ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో చేరిక ప్రక్రియను ప్రభుత్వ యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. "మహిళల భద్రత అనేది ఒక్క శాఖ బాధ్యత కాదు, అది ప్రభుత్వ సమగ్ర కర్తవ్యం. నిర్లక్ష్యానికి చోటులేకుండా, బాధ్యతతో, సాంకేతికతతో, సమన్వయంతో పనిచేస్తేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మహిళా సాధికారతకు అవసరమైన పలు కీలక పథకాలను రూపొందించి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతో త్వరలో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమవేశంలోనే మహిళలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన ఇందిరమ్మ మహిళా శక్తి యూనిఫాం సారీల డిజైన్లను మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవ రాజన్ పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులను సూచించారు. కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా పంపిణి చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు.

# బఫర్ జోన్, ఎఫ్ టీఎల్ పేరుతో ఇకపై పేదల ఇండ్లు మీరు కూలిస్తే...
# అదే ప్రాంతంలోని పెద్దల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చి

- బీజేపీ కార్యకర్తల ఓపికను చేతగానితనంగా భావిస్తే గుణపాఠం తప్పదు
- రాహుల్ గాంధీ... శిక్షణా తరగతులకు కాదు... బాధిత ప్రాంతాల్లో పర్యటించండి
- రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చేది మూటల కోసమే
- మూసీ పరిధిలో పేదల ఇండ్లను కూల్చి పెద్దలతో బేరాలాడుతున్నారు
- గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గం
- గాంధీ ఆత్మ క్షోభిస్తోంది
- గుజరాత్ లో సర్దార్ పటేల్ విగ్రహం నిర్మించి మోదీ ప్రభుత్వం ప్రజల మనసులను దోచుకుంది
- రాష్ట్రంలో గాంధీ విగ్రహం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఉసురు తీస్తోంది
- అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల ఏ దేశంతో యుద్ధం వస్తుందో రాహుల్ సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ లోనే అంతర్యుద్ధం మొదలైన సంగతి రాహుల్ గుర్తుంచుకోవాలి
- కాంగ్రెస్ తో జరిగిన యుద్ధంలో ప్రజలు దేశవ్యాప్తంగా ఆ పార్టీని బొంద పెట్టారు
- మూడు రాష్ట్రాలకే కాంగ్రెస్ ను పరిమితం చేశారు
- బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు బయట కూడా తిరగలేరు
- కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కామారెడ్డి వెలుతురు మార్చి 02:

"మీరు బఫర్ జోన్లు, ఎఫ్ టీఎల్ పేరుతో ఇకపై పేదల ఇండ్లను కూల్చాలనుకుంటే... అదే ప్లేస్ లో కట్టిన పెద్దల ఇండ్లను, కాంగ్రెస్ నేతల ఇండ్లను కూల్చేసేందుకు బీజేపీ కార్యకర్తలు బుల్డోజర్లతో వస్తారు. తాడోపేడో తేల్చుకుంటారు. ఒకవేళ శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైతే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి"అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. "పరీక్షలున్నాయనే సాకుతో చెరువును ఆక్రమించి ఒవైసీ కుటుంబం నిర్మించిన ఫాతిమా కాలేజీని టచ్ కూడా చేయని కాంగ్రెస్ ప్రభుత్వం... ఖమ్మంలో ఇండ్లను నిర్మించుకుని బతుకుతున్న కుటుంబాల్లో టెన్త్, ఇంటర్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు బతిమిలాడినా వినకుండా వాటిని ఎందుకు కూల్చివేశారు? ఫాతిమా కాలేజీకి ఒక న్యాయం? పేదలకు మరో న్యాయమా?" అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా హిందువులపై, హిందూ దేవాలయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు చేయిస్తూ అరాచకాలకు పాల్పడుతోందన్నారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తోందన్నారు. "హిందువులారా...ఇంకెన్నాళ్లు కాంగ్రెస్ అరాచకాలను భరిద్దాం? ఇంకెన్నాళ్లు బిచ్చపు బతుకులు బతుకుదాం. రాజకీయాలను, పార్టీలను పక్కనపెట్టి కాషాయ జెండా పట్టి ఏకమై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కండి"అని పిలుపునిచ్చారు. తాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయినప్పటికీ ఒక హిందువుగా మాట్లాడుతున్నానని చెప్పారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా మహాభియాన్ పేరిట కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ విచ్చేశారు. అక్కడి నుండి పార్టీ జిల్లా కార్యాలయానికి వెళ్లి బాన్సువాడ బాధిత కుటుంబాలను పరామర్శించి వారు గోడును విన్నారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే.... ఇయాళ రాహుల్ గాంధీ శిక్షణా తరగతుల పేరుతో హైదరాబాద్ కు వచ్చారు. వాస్తవానికి అదే శిక్షణా తరగతుల వేదికపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "రాహుల్ గాంధీకి రూ.వెయ్యి కోట్లు వసూలు చేసి ఇస్తాం"అని అన్నారు. రాహుల్ గాంధీ ఇక్కడికి వచ్చి ఆ మూటల కోసమా? లేక శిక్షణా తరగతుల కోసమా? స్పష్టం చేయాలి. రాహుల్ గాంధీని కోరుతున్నా... హైదరాబాద్ కు వచ్చారు కాబట్టి దయచేసి మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తున్న ప్రాంతాలకు వెళ్లాలని కోరుతున్నా. అట్లాగే ఖమ్మంలో భూదాన్ భూముల పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిన ప్రాంతానికి వెళ్లాలని కోరుతున్నా. అట్లాగే హిందూ దేవాలయాలపై దాడులు జరిగిన బంజారాహిల్స్ పెద్దమ్మ తల్లి, సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయాలను సందర్శించాలని కోరుతున్నా. అట్లాగే బాన్సువాడలో అన్యాయంగా, అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో వేసిన బాధిత కుటుంబాలను పరామర్శించాలని కోరుతున్నా. అమాయకులైన శ్రీనివాస్ లాంటి వాళ్లను దాడులతో సంబంధం లేకుండా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. తెలంగాణలో విద్యాశాఖకు, హోంశాఖకు మంత్రే లేరు. ముఖ్యమంత్రే తన వద్ద పెట్టుకున్నారు. మరి వాస్తవ సమాచారం అందుతుందా? లేదా? మజ్లిస్ పార్టీ మెప్పు పొందడానికి, మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామనే అహంకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఒవైసీకి తొత్తుగా మారారు. హైదరాబాద్ లో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని సర్వేలు తేల్చడంతో జీహెచ్ఎంసీ ఎన్నికలను వాయిదా వేశారు. బాన్సువాడలో జరిగిందేమిటి? ఎవరు ఎవరి ప్లేస్ లోకి వచ్చి దాడులు చేశారనే విషయంపై వాస్తవ సమాచారం తెలుసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సింది పోయి... ఒవైసీ కళ్లల్లో ఆనందం చూడటానికి హిందువులపై అనేక అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా అరెస్ట్ చేసి జైల్లో వేయడం దుర్మార్గం. చాలా మంది కూలీనాలీ చేసుకునే యువకులు పోలీసుల వేధింపులకు తాళలేక ఇళ్లను వదిలి పారిపోయారు. ఆరోగ్యం బాగాలేకపోయినా, మాటలు వినబడకపోయినా వీడియోలో కన్పించారనే ఒకే ఒక్క కారణంతో అమాయకుడైన శ్రీనివాస్ ను అన్యాయంగా పట్టుకుపోయి జైల్లో వేయడం సిగ్గు చేటు. హిందూ సమాజానికి విజప్తి చేస్తున్నా. మీరంతా జాగ్రుతం కావాల్సిన సమయం ఆసన్నమైంది. హిందువులంతా రోడ్లపైకి వచ్చి కాంగ్రెస్, ఎంఐఎంలకు బుద్ది చెబుదామా? లేక వాళ్ల ముందు బిచ్చపు బతుకులు బతుకుదామా? ఆలోచించండి. బొట్టు పెట్టుకుని దేవుడిని మొక్కేవాడు మాత్రమే హిందువు కాదు. ఏ దేవుడి కరుణా కటాక్షాలతో బతుకుతున్నామో... అదే దేవుడి ఆలయాలపై, విగ్రహాలపై దాడులు చేస్తున్నా స్పందించకపోవడం, అడ్డుకోని వాళ్లు హిందువులు ఎట్లా అవుతారు? పెద్దమ్మ గుడిపై దాడులు చేస్తే అడ్డుకుంటే లాఠీఛార్జ్ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. బాన్సువాడలో అమాయకులను అరెస్ట్ చేసి జైల్లో వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో అనేక దేవాలయాలను ధ్వంసం చేశారు. ఇంత ఘోరమా? ఇంత అరాచకమా? అయినా ఇంకెంత కాలం భరిద్దాం? నేను ఇతర మతాల జోలికి వెళ్లను. హిందువుగా మాట్లాడుతున్నా. హిందువులపైన, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడుల గురించి మాట్లాడుతున్నా. నేను హోంశాఖ సహాయ మంత్రినైనా సరే... హిందువుగానే మాట్లాడుతున్నా. కాంగ్రెస్ ప్రభుత్వ హిందూ వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయాలకు అతీతంగా కాషాయ జెండాను పట్టుకుని ఐక్యంగా హిందూ వ్యతిరేక విధానాలపై పోరాడదాం రండి. లేనిపక్షంలో చరిత్ర హీనులుగా మిగిలిపోతాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపట్ల దారుణంగా వ్యవహరిస్తోంది. నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదలందరికీ 4 కోట్లు ఇండ్లు కట్టి పోటీపడుతుంటే... రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం పేదల ఇండ్లను కూల్చడంలో పోటీ పడుతోంది. బఫర్ జోన్లు, ఎఫ్ టీఎల్ పేరుతో పేదల ఇండ్లను కూలుస్తూ... పెద్దల ఇండ్లు కట్టినా వాళ్లతో బేరసారాలకు దిగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ చేస్తున్నా... బఫర్ జోన్లో, ఎఫ్ టీఎల్ పరిధిలో ఉన్న ఎంత మంది పేదల ఇండ్లు కూల్చారు? ఎంత మంది పెద్దల, రాజకీయ పార్టీ నేతల ఇండ్లను కూల్చారో చెప్పండి. మూసీ పరిధిలో రూ.5 వేల కోట్లతో గాంధీ విగ్రహం పెడతామని చెబుతూ... పేదల ఇండ్లను కూలుస్తుంటే ఆ మహాత్మాగాంధీ ఆత్మ ఘోషిస్తోంది. మోదీ ప్రభుత్వం గుజరాత్ లో అతి భారీస్థాయిలో సర్దార్ పటేల్ విగ్రహాన్ని కట్టి ప్రపంచ ప్రజల మనసును దోచుకుంటే... రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం గాంధీ విగ్రహం పేరుతో పేదల ఉసురు తీసుకుంటోంది. ఖమ్మంలో పేదలు నిర్మించుకున్న వందల కుటుంబాలను అన్యాయంగా కూల్చేశారు. ఆ ఇండ్లలో టెన్త్, ఇంటర్ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులపై కూడా కనికరం చూపకుండా దుర్మార్గంగా ఇండ్లను కూల్చివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం... హైదరాబాద్ లోని ఒవైసీ అక్రమంగా నిర్మించిన ఫాతిమా కాలేజీని కూల్చేయాలని మేం డిమాండ్ చేస్తే... ఆ విద్యార్థులకు పరీక్షలున్నాయి. వాళ్ల భవిష్యత్తు దెబ్బతింటుందని సాకులు చెప్పి ఆపారు. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ద్రుష్టిలో ఫాతిమా కాలేజీ విద్యార్థులకు మాత్రమే భవిష్యత్తు ఉందా? ఖమ్మంతోపాటు ఇతర ప్రాంతాల్లోని పేద పిల్లలకు భవిష్యత్తు లేదా? ఇష్టానుసారం కూల్చేస్తారా? పేదల ఇండ్లను కూలుస్తూ...పెద్దలిచ్చే పైసలతో జల్సాలు చేయడమే కాంగ్రెస్ నేతల పనా? రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తుందా? పేదలు రాత్రి పూట పడుకుంటే బుల్డోజర్లు కన్పిస్తున్నాయి.

ఎప్పుడు ఇల్లు కూలుస్తారోననే భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. నేను ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా... మీరు బఫర్ జోన్లు, ఎఫ్ టీఎల్ పేరుతో ఇకపై పేదల ఇండ్లను కూల్చాలనుకుంటే... అదే ప్లేస్ లో కట్టిన పెద్దల ఇండ్లను, కాంగ్రెస్ నేతల ఇండ్లను కూల్చేసేందుకు బుల్డోజర్లతో వస్తాం. తాడోపేడో తేల్చుకుంటాం. శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైతే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్ర ప్రజలంతా ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి మాట్లాడుతుంటే... ఆ హామీలను గాలికొదిలేసి ఏఐసీసీ పెద్దలకు మూటలు అప్పగించడంపైనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ద్రుష్టి పెట్టింది. ప్రజల ద్రుష్టిని దారి మళ్లించేందుకు కేసీఆర్ కుటుంబంపై విచారణ, పేదల ఇండ్ల కూల్చివేత పేరుతో డ్రామాలాడుతున్నారు. 6 గ్యారంటీలపై బీజేపీ నిలదీస్తుంటే... కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడలు పేరుతో భయభ్రంతులకు గురి చేయాలనుకుంటోంది. బీజేపీ కార్యకర్తల ఓపికను చేతగాని తనంగా భావిస్తే కాంగ్రెస్ కే నష్టం. కామారెడ్డిలో బీజేపీ కార్యకర్తలు ఏ విధంగా గుణపాఠం చెప్పారో రాష్ట్ర ప్రభుత్వానికి అంతకు మించి బుద్ది చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. కేంద్రంతోపాటు 20 రాష్ట్రాల్లో మేం అధికారంలో ఉన్నాం. మేం తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు ఇండ్ల నుండి బయటకు కూడా రాలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్ అరాచకాలను ఎదుర్కొని ఎందాకైనా పోరాడేందుకు బీజేపీ నేతలు సిద్ధంగా ఉన్నారు. అమెరికాతో ట్రేడ్ డీల్ చేసుకుంటే ఏ దేశంతో యుద్ధం భారత్ కు యుద్ధం వస్తుందో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. పిచ్చి కూతలు కూస్తున్న రాహుల్ గాంధీ.... కాంగ్రెస్ తోనే ప్రజలు యుద్ధం చేస్తున్న విషయాన్ని మర్చిపోయారు. ప్రజలు కాంగ్రెస్ ను దేశవ్యాప్తంగా బొంద పెట్టారు. మూడు రాష్ట్రాలకే పరిమితం చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కరీంనగర్ లోనూ కాంగ్రెస్ ను ఖతం చేసి మేయర్ సీటును బీజేపీ కైవసం చేసుకుందని తెలుసుకుని మాట్లాడాలి.

# సంపాదకీయం.. అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకో వడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా



చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్ఘాన్‌తో కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్లో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘౌలామ్ హుసేన్ మొహ్సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్దాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తరిఉగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.

# నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

**- ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్**



**హైదరాబాద్,మార్చి2( వెలుతురు):** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# "ఆటో అన్నల వెయ్యి రూపాయల భృతి ప్రభుత్వానికి భారమా?"



**మన్నారం నాగరాజు.**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*ప్రజాస్వామ్యం అంటే ప్రజల ఆకాంక్షలను పాలనగా మార్చే రాజకీయ ప్రక్రియ. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు చేసే వాగ్దానాలు కేవలం ప్రచార అలంకారాలు కావు. అవి ప్రజల జీవితాలతో కుదిరే ఒప్పందాలు. ఆ ఒప్పందం అమలులో విఫలమైతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది అనే ప్రశ్నే ఈ వ్యాసానికి కేంద్రబిందువు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆటో డ్రైవర్ల పరిస్థితి ఈ నైతిక ప్రశ్నను మరింత గాఢంగా మన ముందుకు తెస్తోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, సామాజిక భద్రత వంటి అంశాలు ముఖ్యంగా ప్రస్తావించబడ్డాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలు కార్యరూపం దాల్చాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. పెరుగుతున్న ఇంధన ధరలు, నగరాల్లో పెరిగిన జీవన వ్యయాలు, డిజిటల్ క్యాబ్ సేవల పోటీఇవి ఆటో డ్రైవర్ల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఒక ఆటో డ్రైవర్ రోజంతా కష్టపడి సంపాదించిన ఆదాయం కుటుంబ పోషణకే సరిపోవడం లేదు. పిల్లల చదువు, ఆరోగ్య ఖర్చులు, ఇల్లు అద్దె, ఇవన్నీ అతని భుజాలపై భారం పెడుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు పత్రికల ప్రకటనలకే పరిమితమైతే, ఆ వాగ్దానాలకు నైతిక విలువ ఏముంటుంది?*

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఏర్పడిన సంస్థ. కానీ పాలకులు ప్రజల వేదనలను విస్మరిస్తే, ప్రజాస్వామ్యం కేవలం ఓటింగ్ ప్రక్రియగా మారిపోతుంది. ఆటో డ్రైవర్ల సమస్యలు కేవలం ఒక వర్గపు సమస్యలు కావు, అవి ప్రభుత్వ విధానాల అమలులోని లోపాలను ప్రతిబింబించే సూచికలు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తే, ఎన్నికల హామీలను అమలు చేయడం అనివార్యం. ఆటో డ్రైవర్లకు ఆర్థిక భద్రత, సంక్షేమ పథకాల అమలు, సామాజిక రక్షణఇవి మాటల్లో కాదు, కార్యాచరణలో కనిపించాలి. లేకపోతే ప్రజల విశ్వాసం కోల్పోవడం తప్పదు. ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రజాస్వామ్యం శక్తివంతమైన వ్యవస్థగా నిలబడదు. ఇకఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ నాంపల్లి సభలో ఆటో డ్రైవర్ వేషంలో వేదికపైకి వచ్చి మాట్లాడిన సందర్భం ఒక రాజకీయ దృశ్యం మాత్రమే కాదు. అది లక్షలాది ఆటో డ్రైవర్ల ఆశల ప్రతిబింబం. నెలకు వెయ్యి రూపాయల భృతి, సంక్షేమ బోర్డు, బీమా భద్రత వంటి హామీలు రాజకీయ వ్యూహాలు మాత్రమే కాకుండా ఒక వర్గానికి ఇచ్చిన స్పష్టమైన ప్రజా ఒప్పందం. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటలు పాలనలో కనిపించకపోవడం ప్రజాస్వామ్యంపై గాఢమైన అనమ్మకాన్ని కలిగిస్తోంది.

తెలంగాణలో సుమారు ఏడు లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని యూనియన్లు చెబుతున్నాయి. వీరు నగరాల నడిబొడ్డులో, పట్టణాల గల్లీల్లో, గ్రామాల అంచుల్లో ప్రజల జీవితాలను ముందుకు నడిపే అనధికారిక ప్రజా రవాణా వ్యవస్థ. వారి జీవితం రోజువారీ ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. పెరుగుతున్న ఇంధన ధరలు, రిపేర్ ఖర్చులు, ట్రాఫిక్ చలాన్లు, యాప్ క్యాబ్‌ల పోటీ, కొంతమంది పోలీస్ వేధింపులు ఇవన్నీ కలిసి ఒక ఆటో డ్రైవర్ జీవితాన్ని అస్థిరతలోకి నెట్టేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే వెయ్యి రూపాయల భృతి ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదు,అది ఒక కుటుంబానికి ఊపిరి, ఒక మానసిక భరోసా.

ప్రజాస్వామ్య పాలనలో నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు నైతిక ఒప్పందాలు. ఆ ఒప్పందాలు అమలుకాకపోతే ప్రజల నమ్మకం కూలిపోతుంది. ప్రజలు ఓటు వేస్తారు మాటల మీద నమ్మకంతో. ఆ మాటలే పాలనగా మారకపోతే ప్రజాస్వామ్యం ఖాళీ ప్రక్రియగా మారుతుంది. ఆటో డ్రైవర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న విమర్శ ఇదే. హామీలు ఇచ్చారు, కానీ అమలు కాలేదు. ఈ వ్యత్యాసం రాజకీయ విమర్శ మాత్రమే కాదు,ఇది పాలనా నైతికతపై ప్రశ్న. రాష్ట్ర బడ్జెట్‌లో వేల కోట్ల ప్రాజెక్టుల గురించి గర్వంగా మాట్లాడే నాయకులు, లక్షలాది కార్మిక కుటుంబాలకు భరోసా ఇచ్చే పథకాలకు డబ్బులు లేవంటారు. ఇది ఆర్థిక న్యాయంపై ప్రశ్న. సంక్షేమం అంటే ఎన్నికల ముందు గుర్తొచ్చే పదమా? లేక అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగాల్సిన బాధ్యతా? ఆటో డ్రైవర్ల భృతి సుమారు రెండేళ్లలో పదిహేను వందల కోట్ల రూపాయలు అవుతుందని యూనియన్లు లెక్కలు చెబుతున్నాయి. ఇది రాష్ట్ర ఖజానాకు భరించలేని భారమా? లేక సామాజిక భద్రతకు పెట్టుబడా అనే ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పాలి. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యల అంశం మరింత దురదృష్టకరం. ఉపాధి కోల్పోయి, అప్పుల భారంతో, కుటుంబాలను పోషించలేక సుమారు 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని యూనియన్లు చెబుతున్నాయి. ఈ సంఖ్యలు గణాంకాలు మాత్రమే కాదు. అవి పాలన వైఫల్యానికి మానవ ముఖాలు. ఒక ఆటో డ్రైవర్ మరణం ఒక కుటుంబాన్ని అస్తవ్యస్తం చేస్తుంది. భార్య, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు అందరి జీవితాలు ఒక్కసారిగా అంధకారంలోకి నెట్టబడతాయి. ఇలాంటి కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కేవలం డబ్బు కాదు, అది ఒక నైతిక బాధ్యత. బీమా పథకాల పునరుద్ధరణ కూడా కీలక అంశం. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు బీమా కల్పించింది. ప్రమాదం జరిగితే కుటుంబానికి కొంత భరోసా ఉండేది. కానీ కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకం ఎందుకు కొనసాగలేదు? ఇది నిధుల సమస్యా? లేక పాలనా నిర్లక్ష్యమా? పాలకులు చేయాల్సిన పనిని ప్రతిపక్ష నేతలు చేయాల్సి రావడం పాలనా వైఫల్యానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే ప్రజల భద్రతకు బాధ్యత వహించే సంస్థ. ఆ బాధ్యతను విస్మరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. తెలంగాణ ఉద్యమంలో ఆటో డ్రైవర్ల పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ధర్నాలు, ర్యాలీలు, బంద్‌లు, ఉద్యమం ప్రతి దశలో వారు ముందువరుసలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో వారి త్యాగం అపూర్వం. ఆ త్యాగానికి ప్రతిఫలం ఏమిటి? నిర్లక్ష్యమా? హామీల అమలు లేమియా? ఈ ప్రశ్నలు కేవలం రాజకీయ విమర్శలు కావు, ఇవి చరిత్రకు సంబంధించిన నైతిక ప్రశ్నలు. సంక్షేమ బోర్డు, జీరో వడ్డీ రుణాలు, క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదు. పాలన అంటే మాటలు చెప్పడం కాదు, మాటలను కార్యరూపం దించడమే పాలన. ప్రజా పాలనలో మాటలు అలంకారాలు కావు. అవి ప్రజల జీవితాలతో కుదిరే ఒప్పందాలు. ఆ ఒప్పందం అమలులో విఫలమైతే ప్రజాస్వామ్యం పట్ల ప్రజల విశ్వాసం కూలిపోతుంది. ఆటో డ్రైవర్ కుటుంబాల సామాజిక ప్రభావం మరింత తీవ్రమైనది. పిల్లల చదువు, ఆరోగ్యం, సామాజిక స్థానం ఇవన్నీ తండ్రి ఆదాయంపై ఆధారపడి ఉంటాయి. ఆదాయం తగ్గితే పిల్లలు చదువు మానేసి చిన్న వయసులోనే పని చేయాల్సిన పరిస్థితికి వస్తారు. ఇది కేవలం ఒక కుటుంబ సమస్య కాదు, ఇది సమాజ భవిష్యత్తుపై పడే ప్రభావం. పాలనలో ఈ కోణం కనిపించకపోవడం సామాజిక బాధ్యతల విస్మరణ. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే ప్రజల కష్టాలకు ప్రతిస్పందించే వ్యవస్థ. ప్రజల ఆకలి అరుపు వినిపించకపోతే ప్రజా పాలనలో మానవత్వం ఎక్కడ ఉంటుంది? ఆటో డ్రైవర్ ఉదయం ఇంటి గడప దాటేటప్పుడు ఉండే భయం, ఆశ, ఆందోళన ఇవన్నీ పాలకులకు కనిపించాలి. ఒక రైడ్ దొరికితే వచ్చే ఊరట, అదే రోజు ఖర్చులు తిరిగి వస్తాయా అనే సందేహం, ఇంట్లో పిల్లల ముఖాల్లో కనిపించే నిరీక్షణ ఇవన్నీ కలిసి ఒక సామాజిక వాస్తవం. రాజకీయంగా ఈ సమస్య భవిష్యత్ ప్రభావాలు కలిగి ఉంటుంది. కార్మికులను పట్టించుకోని పాలనలు ఎక్కువ కాలం నిలబడలేదు. కార్మికుల ఆవేదన ఎప్పుడో ఒకప్పుడు రాజకీయ రూపం దాల్చింది. ఆటో డ్రైవర్ల సమస్యను నిర్లక్ష్యం చేయడం రేపటి రాజకీయ సంక్షోభానికి విత్తనాలు వేయడం. స్థానిక సంస్థల ఎన్నికల్లో, ముఖ్యంగా +ఎవీజ ఎన్నికల్లో, ఆటో డ్రైవర్ల ఓటు కీలక పాత్ర పోషించగలదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రజాస్వామ్యమా? లేక నిజమైన బాధ్యతల ప్రజాస్వామ్యమా? ప్రజాస్వామ్యం అనేది ఎన్నికల హామీలు, సభల ప్రసంగాలు, ప్రకటనల వరకే పరిమితం కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల జీవితాలతో ముడిపడిన పాలన. ప్రజలు అడిగే ప్రశ్నలకు కేవలం మాటలతో కాదు, చర్యలతో సమాధానం చెప్పగలిగినప్పుడే అది సజీవ ప్రజాస్వామ్యంగా నిలుస్తుంది. ప్రజల విశ్వాసం మాటలపై కాదు, కార్యాచరణపై ఆధారపడుతుంది. ప్రభుత్వాలు పథకాలు ప్రకటిస్తాయి, కమిటీలు వేస్తాయి, నివేదికలు సిద్ధం చేస్తాయి. కానీ ఆ నివేదికలు భూమిపై కనిపించనప్పుడు ప్రజల నమ్మకం క్రమంగా క్షీణిస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ఉన్న అత్యంత పెద్ద మూలధనం ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసం ఒకసారి దెబ్బతింటే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టం.

ఆటో అన్నల ఆకలి అరుపు కేవలం రాజకీయ విమర్శ కాదు. అది పాలనపై ప్రజల నిస్సహాయతకు, నిరాశకు, ఆగ్రహానికి ప్రతీక. సమాజంలో అట్టడుగు వర్గాల నుంచి వచ్చే ఈ అరుపు ఒక ప్రజాస్వామ్య నైతిక పరీక్ష. ప్రభుత్వాలు ఈ అరుపును రాజకీయంగా మాత్రమే చూసి నిర్లక్ష్యం చేస్తే, ప్రజాస్వామ్యపు మూల సూత్రాలకే విఘాతం కలుగుతుంది. ఈ పరీక్షలో ప్రభుత్వం ఉత్తీర్ణత సాధించాలంటే మాటలతో కాదు, చర్యలతో ముందుకు రావాలి. ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలు, ధరల నియంత్రణ, కార్మికుల భద్రత వంటి అంశాల్లో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది.

లేకపోతే ప్రజల నమ్మకం చరిత్రలో మరోసారి దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యం ఎన్నికల యంత్రాంగం మాత్రమే కాదు, ప్రజల జీవన హక్కుల పరిరక్షణ వ్యవస్థ. ప్రజల ఆకలి అరుపు వినిపించకపోతే, ప్రజాస్వామ్యం కేవలం పుస్తకాలలోని పదంగా మిగిలిపోతుంది. సమాధానం మాటల్లో కాదు, పాలనలో కనిపించాలి.

https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

# ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):



ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ (ఇంఛార్జి) చంద్రావతి లతో కలిసి అదనపు కలెక్టరు (153) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (53) దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో శ్రీపాదరావు జయంతి వేడుకలు

**- ఘనంగా నివాళులు అర్పించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):

దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన & క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ (ఇంఛార్జి) చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ సమీక్ష...



హైదరాబాద్ వెలుతురు మార్చి 02:

హిమాయత్ నగర్ డివిజన్ లో రెడ్డి కాలనీలో నూతన సీసీ రోడ్డు పనుల పురోగతిపై డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ సమీక్షించారు. ఈ సందర్భంగా అక్కడున్న కాలనీవాసులు కొన్ని విషయాలు మాజీ కార్పొరేటర్ దృష్టికి తేవడంతో వారు వెంటనే జిహెచ్ఎంసి చరణ్, జలమండలి మేనేజర్ వెంకటేష్, సుల్తాన్ బజార్ ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ వాళ్లకు పిలిపించి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించి పనులను ముందు సాగించాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, మహేష్, జస్వాల్, సందీప్, శేఖర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ జిపిఓ గణేష్.





కుత్బుల్లాపూర్ మార్చి 02(వెలుతురు ప్రతినిధి):

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహించారు. 15000 వేలు రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా జిపిఓ గణేష్ పట్టుబడ్డాడు. ఫ్యామిలీ సర్టిఫికెట్ విషయంలో 30 వేలు డిమాండ్ చేసి,15000 తీసుకుంటు ఉండగా రెడ్ హ్యాండ్ గా అతని పట్టుకున్నారు. అతని పట్ల అనేక ఆరోపణలు ఉన్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. కుత్బుల్లాపూర్ తహసిల్దార్ కార్యాలయంలో ఇంకా విచారణ కొనసాగుతుంది.

# దోమల నివారణకు చర్యలు తీసుకోండి

**- బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్**

వెలుతురు కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మార్చి 02:



జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్లోని ప్రజావాణిలో సిపిఐ ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో చెరువులు, కుంటల్లో గుర్రపు డెక్కలతో నిండిపోవడం వల్ల వాటిని ఆధారం చేసుకొని దోమలు పెరిగిపోతువున్నాయన్నారు. దోమలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున నిరసనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి, పి.కవిత, శివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ బంజారా స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

ఢిల్లీ మార్చి 02 వెలుతురు న్యూస్:

ఢిల్లీ బంజారా స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ మాట్లాడుతూ అంత్యంత పూజనీయులు సంత్ సేవాలాల్ మహారాజ్ మరియు బంచార గిరిజన జాతుల ఆరాధ్య దైవమైన సంక్షేవాలాల్ మహారాజ్ నేటి యువతకు ఆదర్శప్రాయ వ్యక్తిత్వమని కొనియాడారు ప్రతి కుల వర్గ పరిస్థితుల్లోనూ సమాజ హితాన్ని పనిచేసిన మహానీయుడుగా అయినను అభి వర్ణించారు సమాజంలో సమానత్వం న్యాయం సేవా భావం వంటి విలువలను సేవాలాల్ మహారాజ్ ప్రతిపాదించారని తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు అలాగే బంజారా లిపి



చరిత్రలను ఆచరణలో తీసుకురావాల్సిన అవసరాన్ని అయినా ప్రస్తావించారు ఈ కార్యక్రమంలో రాములు నాయక్ సంజీవ్ నాయక్ వివిధ కులాల సంఘ నాయకులు ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది





# ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీయెుద్దు

**- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్రప్రధాన కార్యదర్శి (తపస్) తెల్కలపల్లి పెంటయ్య**

ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 02:

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోఏర్పాటుచేసిన సమావేశంలోతెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్రప్రధాన కార్యదర్శి పెంటయ్య మాట్లాడుతూ అరకొర వసతులతో ప్రైవేట్ పాఠశాల లతో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య బోదిస్తు న్న ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా వారి జీతభత్యాలపైన పదోన్నతుల పైన విద్యా కమీషన్ నివే దిక సమర్పించటం యావత్ తెలంగాణా ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర మనోవేదనకు గురించేసిం దన్నారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోతుంది ఏంచేస్తే ప్రభుత్వ పాఠ శాలలు బలోపేతం అవుతాయి అని సమగ్రంగా పరిశోధించి నివేదిక సమర్పించమంటే ఉపాధ్యా యుల ఆత్మగౌరవాన్ని తగ్గించేటట్లు వారికి జీతాలు ఎక్కువ కాంట్రాక్టు వారిని తీసుకుంటే ప్రభు త్వానికి భారం తగ్గుతుంది డైరెక్ట్ ప్రమోషన్స్ అవసరం లేదు అనేది రీతిలో నివేదిక ఉందనిదీన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) తీవ్రంగా వ్యతిరేకిస్తుంది నివేదికలో ఇప్పటికే ఉన్న పాఠశాలను ఎలాబలోపేతం చేయాలి అని చెప్పడానికి బదులు కొత్తగా



మండలానికి రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్ లు ఏర్పాటు చేసి ఉన్న మిగతా పాఠశాలలను మూసి వేయమని సలహా ఇచ్చినట్లు ఉందిగ్రామీణ ప్రాంతాలలో చాలామంది పిల్లలు దూరంలో ఉన్నబడికి వెళ్ల లేక విద్యకు దూరమవుతున్నారని ఉద్దేశంతో ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల మూడు కిలోమీ టర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు ఏర్పాటుచేసి తెలంగాణ ప్రాంతం అక్షరాస్యతలో ముందు ఉండేలా గత ప్రభుత్వాలు ఆలోచన చేస్తే ఈ నివేదిక ద్వారా ఉన్న పాఠశాలలను మూ సివేయాలని ప్రభుత్వానికి సలహా ఇచ్చినట్టు ఉంది దీని ద్వారా ఎంతో మంది పేద బడుగు బల హీన వర్గాల విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది ఇప్పటికే పిఆర్సి అ మలుకాక ఐదు డిఏలు పెండింగ్లో ఉండి రావాల్సిన బకాయిలు రాక,పదవి విరమణ పొందిన ఉ పాధ్యాయులు తమకు రావాల్సిన పదవీ విరమణ బకాయిలు రాక ఇబ్బందులు పడుతుంటే ఉ న్న జీతాలు ఎక్కువ అనడం పట్ల తెలంగాణ ప్రాంత ఉపాధ్యా య సంఘం విద్యా కమిషన్ రిపో ర్టును, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి సార్ గారి వ్యవహార తీరును వ్యతిరేకి స్తుంది ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల యొక్క జీతాలు ఉన్నతంగా ఉంటేనే మేధా వులు విద్యారంగంలో బోధన చేయడానికి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది అని 1964 లో నే కొఠారి కమిషన్ పేర్కొంది దీని పైన కనీస అవగాహన లేని విధంగా ఈ రిపోర్టు ఉంది ఇప్పటి కైనా ప్రభుత్వం విద్యా కమిషన్ సమర్పించిన రిపోర్టుపై అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి అవస రమయ్యే విధంగా దానిని రూపొందించి ప్ర భుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యేవిధంగా అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆత్మ గౌ రవంతో పనిచేసేలా రూపొందిస్తే బాగుంటుంది ఈసమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోట్ల కాశి రావు ప్రధాన కార్యదర్శి పూజారి రమేష,రాష్ట్ర మీడియా కో కన్వీనర్ సత్తారి రాజిరెడ్డి ఇబ్ర హీంపట్నం మండల అధ్యక్షులు రాజేందర్ జిల్లా బాధ్యులు నరసింహ కరుణాకర్ జంగయ్య తది తరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా కమిటీ హాల్ పనిచేయాలి - రావుల శేషగిరి

వెలుతురు కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మార్చి 02:

ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా కమ్యూనిటీ హాల్ పనిచేయాలని గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్ పరిధిలో నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ బస్తీ కమిటీ హాల్ ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమానికి బిజెపి నాయకులు, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్య అతిథిగా హాజరై, కమిటీ హాల్‌ను ప్రారంభించారు. బస్తీ ప్రజల సౌకర్యార్థం, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈహాల్ ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పిట్ల మల్లేష్, పీట్ల మధు, అంబధాస్, నవీన్, భాస్కర్, మహేందర్ రెడ్డి, శ్రీకాంత్, హనుమంతు నాయక్, శ్రీకాంత్ నాయక్, కాజా, తిమ్మప్ప, లక్ష్మి, మల్లారెడ్డి, శ్రీను,





అబ్దుల్ ఖాన్, ఎండి అబ్దుల్ కలాం, రాజు, పులిగప్ప దినేష్, అంజిరెడ్డి, యాలప్ప, జయన్న, తిమ్మన్న, పరుశురాం, ప్రసాద్, శివకుమార్, గోపాల్, సంగమేష్, ప్రశాంత్, బస్తీ కమిటీ సభ్యులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# తిరుమలనగర్‌లో కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకారం అభివృద్ధికి కట్టుబాటు

**- క్యాలెండర్ ఆవిష్కరణ**

**మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్‌కు సన్మానం**

కాప్రా, మార్చి 02 వెలుతురు:

నాచారం సర్కిల్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ 2026–2028 సంవత్సరాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. న్యాయ సలహాదారులు శ్రీనివాస్, చంద్రశేఖర్, చేతన్ సమక్షంలో నూతన కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరై, నూతన కమిటీకి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాలనీకి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. సభలో మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన పి. మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మరో రెండేళ్లపాటు బాధ్యతలు అప్పగించిన కాలనీ నివాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం మరింత కృషి చేసి, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి





ఉంటానన్నారు. రాజకీయ నాయకులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి. మల్లేష్ గౌడ్, కార్యదర్శి అమరేందర్ బాబు, కోశాధికారి సుజాత రావు, ఉపాధ్యక్షుడు బీడీ దాస్, ముత్యం వెంకన్న గౌడ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బుల్డోజర్ పాలన

**- పేదల ఇళ్లు కూలుస్తున్న విషయం రాహుల్‌కు తెలియదా**

**- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**

హైదరాబాద్,మార్చి2( వెలుతురు):

యూపీలో మాదిరిగానే తెలంగాణాలో కూడా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు . రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పేద ప్రజల ఇళ్లను నేలమట్టం చేస్తున్న విషయం రాహుల్ గాంధీకి తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అరాచకాలపై మౌనంగా ఎందుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు .గత రెండున్నర ఏళ్లలో రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తున్నారు.. వెళ్తున్నారు.రాష్ట్ర అభివృద్ధి మాత్రం ముందుకు పోవటం లేదని ఆరోపించారు. ఖ మ్మం జిల్లా వెలుగుమట్లలో అధికారులు పేదల ఇండ్లను కూల్చి వేయడం తో ప్రస్తుతం గాజాలా మారిందని పేర్కొన్నారు. యుద్ధం జరిగితే ఎలా ఉంటుందో ఇప్పుడు వెలుగుమట్ల పరిస్థితి అలానే ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఖమ్మం వెళ్లి రోడ్డున పడ్డ ప్రజల దీనస్థితిని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం పార్లమెంట్‌లో రాహుల్ కొట్లాడాలని కోరారు. పేద ప్రజల ఇళ్లు కూల్చిన చోటే కట్టించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని అన్నారు.

# ప్రజావాణి కి 113 దరఖాస్తులు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 2

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్ డి ఓ.వీణ, జడ్పీ సీఈఓ చందర్ లతో కలసి అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా 113 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన భూ సమస్యలు, పెన్షన్ , ఇందిరమ్మ ఇళ్లు, తదితర వాటి పై అర్జీలు స్వీకరించడం జరిగిందని అన్నారు. సంబంధిత అధికారులు అర్జీదారుని సమస్యను క్లుప్తంగా పరిశీలించి పరిష్కరించాలని, తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

# తెలంగాణ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బత్తుల వీరబాబు



ఖమ్మం, వెలుతురు మార్చి 2:

తెలంగాణ బిసి సంక్షేమ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బత్తుల వీరబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. బత్తుల వీరబాబు నియామకం పట్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొదిలి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎలమందల జగదీష్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పలు ఆలయాల్లో ట్రస్టు బోర్డుల్లో దళితులకు చైర్మన్ పదవి ఇవ్వాలి

**- భీమ్ ఆర్మీ అధ్యక్షులు వడ్డేపల్లి నాగరాజు**



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 02:** నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలోని పలు దేవాలయాల ట్రస్టు బోర్డుల్లో దళితులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని భీమ్ ఆర్మీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ వారిజల వేణుగోపాల స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల పాలక మండలి చైర్మన్ మరియు సభ్యుల పదవుల్లో రాజ, గా వర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, నార్కట్ పల్లి పట్టణంలోని వివిధ దేవాలయాలలో గత 34 దశాబ్దాలుగా ఒక్క దళితుడికి కూడా ట్రస్టు బోర్డు చైర్మన్‌గా అవకాశం ఇవ్వలేదన్నారు. కొన్ని సందర్భాల్లో ఒకటి రెండు దేవాలయాల్లో ధర్మకర్తలుగా మాత్రమే అవకాశం కల్పించారని, ప్రస్తుతం ఆ అవకాశాన్ని కూడా పూర్తిగా తొలగించడం దళితులపై వివక్షకు నిదర్శనమని విమర్శించారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించే విధంగా ఆలయాల పాలనలో దళితులకు చైర్మన్ పదవులు మరియు సభ్యత్వాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని, దేవాదాయ శాఖ అధికారులను కోరారు. అవసరమైతే ఈ అంశంపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని భీమ్ ఆర్మీ నాయకులు హెచ్చరించారు

# మండలంలో ప్రవహిస్తున్న దేవాదుల నీటిని అన్ని గ్రామాలకు అందించాలి

**- బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్వోకు వినతి పత్రం**



**గుండాల, మార్చి 2 (వెలుతురు):** గుండాల మండలంలోని ప్రతి గ్రామానికి దేవాదుల ప్రాజెక్ట్ నీటిని సమానంగా అందించాలంటూ బీజేపీ గుండాల మండల శాఖ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారి హరికృష్ణ కు వినతి పత్రం సమర్పించారు. మండలంలోని అనేక గ్రామాలు తాగునీరు,సాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాయకులు తెలిపారు.దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ,అన్ని గ్రామాలకు సమానంగా సరఫరా జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలోని అన్ని గ్రామాల నీటి అవసరాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని,దేవాదుల నీటి పైప్‌లైన్లను విస్తరించి చేరని గ్రామాలకు కనెక్షన్లు కల్పించాలని,తాగునీరు మరియు సాగునీటి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు.మండల ప్రజల సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని ఎంఆర్వోను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పింగళి విజయ్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ మెంబర్ చెడ నాగయ్య, మండల కార్యదర్శి కె. కృష్ణ, బీజేవైఎం నాయకులు సోమరాజు, ఎర్రగొల్ల నరసింహా, యమగాని బాలయ్య, ఎల్లయ్య, కాళి శ్రీను,గొల్లపల్లి సురేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

# రాఘవపురం గ్రామంలో పెండింగ్ లో ఉన్న పెన్షన్ లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం



**బీబీనగర్ మార్చి, 2 (వెలుతురు న్యూస్):**
బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామంలో పెండింగ్లో ఉన్న ఆసరా పెన్షన్లు మంజూరు చేయుట గురించి. పై విషయమును పురస్కరించుకొని, తమరితో మనవి చేయునది ఏమనగా! బీబీనగర్ మండలం, రాఘవాపురం గ్రామంలో వితంతువులు, దివ్యాంగులు, బీడి కార్మికులు, నేతన్నలు, కల్లు గీత కార్మికులు, హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ రోగులు, ఫైలేరియా రోగులు, ఒంటరి మహిళలు, డయాలిసిస్ రోగులు, వృద్ధులు, వితంతువులు మొదలైన వర్గాలకు నెలవారి పెన్షన్ను ప్రభుత్వం అందిస్తున్న క్రమం లో ఈ వర్గాలకు చెందిన బీబీనగర్ మండలం, రాఘవాపురం గ్రామానికి చెందిన ప్రజలు ఆన్లైన్ /ఆఫ్లైన్ ద్వారా 60 మంది దాకా దరఖాస్తు చేసుకోవడం జరిగింది. కాని నెలలు గడుస్తున్నప్పటికీ వారిక పెన్షన్ రాకపోవడంతో వారు, పెన్షన్ రాకపోవడానికి గల కారణాలు తెలుసుకొనుటకు మీసేవా కేంద్రాలకు వెళ్ళగా సైట్ ఓపన్ కాక వారికి కారణాలు తెలియక పలు ఇబ్బందులు పడుచున్నారు. అర్హత కలిగినప్పటికి ఏదైనా సాంకేతిక కారణాల వల్ల పెన్షన్ మంజూరులో ఆలస్యం అగుచున్నదా తెలియడం లేదు. కావున తమరు పరిశీలించి, అర్హత కలిగిన వారికి పెన్షన్ మంజూరు చేయించి, లబ్ధిదారులను ఆదుకోగలరని తమరితో మనవి చేసుకొనుచున్నాము. ఈ కార్యక్రమంలో రాఘవపురం వార్డు సభ్యులు జక్కినగేష్. దొంతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి. బండారి అశ్విని రాఘవేందర్ గౌడ్.బుయ్య పాండు. గుంటిమిది విజయ తదితరులు పాల్గొన్నారు

# నార్కెట్‌పల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 02:**
నార్కెట్‌పల్లి మండల కేంద్రంలోని జీసస్ సాల్వేషన్ మినిస్ట్రీ చర్చిలో నార్కెట్‌పల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ (చీవీఫీ) నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు: గౌరవ అధ్యక్షులు: రెవ. పి. జాన్ బాబు, అధ్యక్షులు: పాస్టర్ నామ మోజెస్, ఉపాధ్యక్షులు: పాస్టర్ పి. అబ్రాహాము, పాస్టర్ చింత మనిషే, ప్రధాన కార్యదర్శి: పాస్టర్ సిహెచ్ సుధాకర్, సంయుక్త కార్యదర్శి: పాస్టర్ సిహెచ్ జార్జి రాజ్, సహాయ కార్యదర్శి: పాస్టర్ చింత సైదులు పాల్, ఖజానాదారు (ట్రెజరర్): పాస్టర్ జి. సమూయేలు రాజ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు (జుజ వీవఎఎవతీం): పాస్టర్ డి. పాల్ పాస్టర్ చింత స్టిపెన్ సలహాదారులు: పాస్టర్ చిలుకా డేవిడ్, పాస్టర్ అదిమల్ల నర్సింగ రాజ్, సభ్యులు: పాస్టర్ హనోక్, యాకోబు, మేడి ఆనంద్, పరంజ్యోతి, రఘుయేలు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మండలంలోని సంఘాల ఐక్యత, ఆధ్యాత్మిక సేవలు మరియు సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# జర్నలిస్టులుగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చూడాలి

**- నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**
**- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మేయర్ కు ఘన సన్మానం**



**నల్లగొండ వెలుతురు మార్చి 02:** ప్రభుత్వం ప్రజల కోసం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేలా జర్నలిస్టులు కృషి చేయాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కోరారు. నల్లగొండ మొట్టమొదటి మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిని సోమవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఆమె నివాసంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు కృషి చేయాలని, కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రజా సంక్షేమంతో పాటు నల్లగొండలో సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని అందులో జర్నలిస్టుల భాగస్వామ్యం కూడా అవసరం అన్నారు. ఏళ్ళ తరబడి ఎదురు చూస్తున్న జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులిమామిడి మహేందర్ రెడ్డి, గాదె రమేష్, టీయూడబ్ల్యూజే 143 అధ్యక్షులు గుండగోని జయశంకర్ గౌడ్ మాట్లాడుతూ నల్గొండ కార్పొరేషన్ అభివృద్ధికి జర్నలిస్టులుగా తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడాలని మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్టులు వెంకట్ రెడ్డి, అల్లి మల్లికార్జున్ యాదవ్, దండంపల్లి రవికుమార్, ఉబ్బని సైదులు, నీలం వెంకటమధు, రెడ్డిపల్లి యాదగిరి, పిల్లలమర్రి శ్రీనివాస్, ముచ్చర్ల విజయ్, ముచ్చర్ల శ్రీనివాస్, కారింగు శ్రీనివాస్, చింత యాదగిరి, రవిశంకర్, వినోద్, రమేష్, పెద్దగోని మధు, పామనగుండ్ల నవీన్,భోగరి రామకృష్ణ, ఓడపల్లి మధు, రవి, కత్తుల హరి, కట్ట యాదయ్య, పెరుమాళ్ళ విజయ్ కుమార్, జానీ నవీన్ గౌడ్,రామకృష్ణ,శివ,రవి తదితరులు ఉన్నారు.

# వనపర్తిలో ఘనంగా టైక్వాండో బెల్ట్ గ్రేడింగ్

**- టైక్వాండోతో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ పెంపు**
**- ఆడపిల్లలకు స్వీయరక్షణపై దృష్టి**
**- విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం**




**వనపర్తి వెలుతురు మార్చి 02:** వనపర్తి జిల్లా కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో మాస్టర్ మైండ్ హై స్కూల్‌లో ఆదివారం టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను మాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థినీలు ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమం అనంతరం విజేతలకు బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ టైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ శారీరక దృఢత్వాన్ని




పెంపొందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలకు స్వీయరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) అత్యంత అవసరమని పేర్కొన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, చదువుతో పాటు శారీరక వ్యాయామం, మెదడు చురుకుదనం కూడా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమని తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. బాలికలకు స్వీయరక్షణలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే ఇలాంటి శిక్షణ అందించడం అభినందనీయమని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ బుద్ధారం రవికుమార్, జూనియర్ కోచ్ శివలీల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు







**భువనగిరి,మార్చి 2 (వెలుతురు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా మరియు భావోద్వేగపూర్ణంగా నిర్వహించబడింది. పాఠశాల ప్రిన్సిపాల్ రఘు అఖిల మాట్లాడుతూ దశాబ్దాలుగా అందిస్తున్న నాణ్యమైన విద్య ఫలితంగా తమ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఐ ఐ టీ,నీట్ , ఎంసెట్ సహా అనేక ప్రభుత్వ పోటీ పరీక్షల్లో విజయం సాధించారని వెల్లడించారు. ఇంత నాణ్యమైన విద్యను అందించడానికి ఏ రకమైన అదనపు ఫీజు వసూలు చేయలేదని స్పష్టంగా పేర్కొన్నారు. ఆకర్షణీయమైన కోర్సుల పేర్లతో విద్యార్థులను తప్పుదోవ పట్టించే వ్యాపార సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులకు గట్టిగా సూచించారు.పాఠశాల డైరెక్టర్ దీపక్ కుమార్ రఘు 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగం కార్యక్రమంలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. డా. ఏపీజే అబ్దుల్ కలాం జీవితంలోని కీలక అంశాలను ప్రస్తావిస్తూ సాగిన ఆ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం విద్యార్థులను, ఉపాధ్యాయులను సమానంగా ప్రేరేపించింది. ఈ సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ఫిజిక్స్ టీచర్ శ్రీనివాసులు కి మరియు బయాలజీ టీచర్ సంతోష్ కి అందించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని మరియు తమ అమూల్యమైన అనుభవాలను హృదయపూర్వకంగా పంచుకున్నారు. చదువు కావాలి అంటే ఏ సంస్థలో అయినా దొరుకుతుంది కానీ విలువలతో కూడిన విజ్ఞానాన్ని ఈ పాఠశాలలో నేర్చుకున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హోలి పండుగ చంద్రగ్రహణం సందర్భంగా ఆచరణలు

**- అర్చకుల సూచనలు**



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 02:** హోలి పండుగ సందర్భంగా వచ్చే హోలి పౌర్ణమి రోజున చంద్రగ్రహణం ఉండటంతో భక్తులు పాటించాల్సిన ఆచారాలను అర్చకులు, పౌరోహిత్యులు డా. బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి నరసింహచార్యులు తెలిపారు.దమంగళవారం హోలి పౌర్ణమి రోజున మధ్యాహ్నం గం.3-19 నిమిషాలకు సంపూర్ణ చంద్రగ్రహణం ప్రారంభమై సాయంత్రం గం.6-46 నిమిషాల వరకు కొనసాగుతుంది. ఈ చంద్రగ్రహణం సింహ రాశిలో సంభవిస్తుందని పేర్కొన్నారు. చంద్రగ్రహణం కారణంగా హోలి పండుగలో భాగమైన వసంతోత్సవం, రంగులు పూసుకునే కార్యక్రమాలు ఉదయం గం.11-31 నిమిషాల వరకు మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు. గ్రహణ సమయంలో పాటించవలసిన నియమాలు పుబ్బ నక్షత్రం, సింహ రాశి వారికి గ్రహణం చూడకూడదు. గర్భిణీ స్త్రీలు గ్రహణ సమయంలో బయటకు వెళ్లకూడదు. గ్రహణ కాలంలో తినడం, తాగడం నివారించాలి. ఉదయం గం.11 లోపు భోజనం చేయాలని సూచించారు. దేవాలయాల నిర్వహణ మంగళవారం ఉదయం గం.7 నుండి దేవాలయాలు మూసివేయబడతాయి. గ్రహణం అనంతరం లేదా బుధవారం ఉదయం సంప్రోక్షణ నిర్వహించి పూజా కార్యక్రమాలు తిరిగి ప్రారంభిస్తారు. గ్రహ దోష నివారణకు సూచనలు గ్రహణం అనంతరం లేదా మరుసటి రోజు: ఇంట్లో దీపారాధన చేయాలి దేవాలయంలో బియ్యం, వెండి సర్పం, వెండి చంద్రబింబం, పాలు వంటి దానాలు చేయడం ద్వారా గ్రహదోష నివారణ కలుగుతుందని తెలిపారు. ఈ విషయాలను అర్చకులు, పౌరోహిత్యులు డా. బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి నరసింహచార్యులు విలేకరులకు వెల్లడించారు.

# బీఆర్ఎస్ పార్టీ రైతు మహా ధర్నా

**నాగిరెడ్డిపల్లి మర్చి, 2 (వెలుతురు న్యూస్):**



భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి వద్ద భువనగిరి-చిట్యాల రహదారిపై టిఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగుకు అవసరమైన యూరియాను సకాలంలో సరఫరా చేయడం లేదని పార్టీ మండల శాఖ నేతలు ఆరోపించారు. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సరఫరా పునరుద్ధించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ నిరసనతో రహదారిపై కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

# గంజాయి స్వాధీనం నిందితుల కోసం గాలింపు



**యాదగిరిగుట్ట మార్చి 02 (వెలుతురు న్యూస్):** యాదగిరిగుట్ట మండలం సైదాపూర్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 60 గ్రాముల గంజాయి, రెండు స్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు. డీటీఎఫ్ బృందం తనిఖీలు చేస్తుండగా నిందితులు చీకట్లో పారిపోయారు. సూపరింటెండెంట్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి, పరారైన వారి కోసం గాలిస్తున్నారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

# రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 02:** ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించి, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధి, వైద్య సిబ్బంది సమస్యలు, ఔషధాల లభ్యత వంటి అంశాలపై చర్చించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని తెలిపారు.ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, రామన్నపేట ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా మెరుగైన వైద్య సేవలు అందేలా కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం...



**రామన్నపేట వెలుతురు మార్చి 02:**
విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు చేయడం కోసం రామన్నపేట మండలం తుమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధి లో గల తుమ్మలగూడం,నిధానపల్లి, భోగారం వ్యవసాయ విద్యుత్ సప్లై లక్ష్మాపురం సబ్ స్టేషన్ పరిధిలో గల లక్ష్మాపురం శోభనాద్రిపురం , నీర్నెంల గ్రామాలలో సింగిల్ ఫేజ్ మరియు, త్రీ ఫేజ్ వ్యవసాయ విద్యుత్ సప్లై ,రామన్నపేట టౌన్ లోనీ విద్యుత్ సబ్ స్టేషన్ నుండి అంబేద్కర్ సర్కిల్ ప్రాతం వరకు అలాగే బస్టాండ్ లో ని ట్రాన్స్ఫార్మర్ కి కూడా సింగిల్ ఫేజ్ మరియు త్రీ ఫేజ్ తేదీ 03.03 2026 వ అనగా మంగళవారం ఉదయం 11 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ శాఖ ఏఈ యం. కోటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆహార భద్రత విద్యా సంస్థలలో నాణ్యమైన భోజన సరఫరా అంశాలపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 2**

సోమవారం కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది . జిల్లా స్థాయి సలహా కమిటీ (DLAC) సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన జిల్లాలో ఆహార భద్రత విద్యాసంస్థలలో నాణ్యమైన భోజన సరఫరా అంశాల పై జిల్లా స్థాయి సలహా కమిటీ (DLAC) సమావేశం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) Food Safety and Standards Act 2006 కింద న్యాయనిర్ణేత అధికారిగా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన వివిధ కమిటీలకు అధిపతిగా వ్యవహరించి, జిల్లా స్థాయిలో ఆహార భద్రతా అధికారుల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో ఆహార నాణ్యత మెరుగుదలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి (DMHO) ప్రభుత్వ నివాస విద్యాసంస్థలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, ప్రతి నెల ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మందుల నిల్వలు, వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలి. కౌమారదశ బాలికలకు ఐరన్ అధికంగా ఉండే మాత్రలు అందించి రక్తహీనతను తగ్గించాలి. ఫుడ్ పాయిజనింగ్ ఘటనల సమయంలో ఆహార భద్రతా విభాగంతో సమన్వయం చేసుకోవాలి. జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించబడుతున్నదీ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు వడ్డించే ముందు ఆహారాన్ని కమిటీ సభ్యులు రుచి చూసే విధానం అమలు చేయాలి. సురక్షిత తాగునీటి సరఫరా , RO ప్లాంట్లు, నీటి ట్యాంకుల శుభ్రతను పర్యవేక్షించాలి. వంటగదుల్లో పరిశుభ్రత పాటిస్తూ వంటవారు చేతి తొడుగులు, టోపీలు ధరించేలా చూడాలి. పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి వడ్డించేలా చర్యలు తీసుకోవాలి. వంటచేసేవారికి , ఆహార నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. జిల్లా సంక్షేమ అధికారి గిరిజన విద్యార్థులు, పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి. ఆరోగ్య శిబిరాల నిర్వహణలో వైద్య శాఖతో సమన్వయం చేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పారిశుధ్యం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. కౌమార బాలికల లో రక్తహీనత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను FSSAI కింద ఉచితంగా నమోదు చేయించాలి. ఆహార నిర్వాహకులందరిలో అవగాహన పెంపొందించాలి. జిల్లా పంచాయతీ రాజ్ అధికారి గ్రామపంచాయతీ స్థాయిలోని అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులను FSSAI కింద నమోదు చేయించాలని సూచించాలి. మండల స్థాయిలో లైసెన్స్ మేళాలు/రిజిస్ట్రేషన్ శిబిరాల సమయంలో ఆహార భద్రతా శాఖతో సమన్వయం చేసుకోవాలి. ఫుడ్ పాయిజనింగ్ ఘటనల సమయంలో తక్షణ సమన్వయం చేయాలి. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆహార వ్యాపార నిర్వాహకులు ఆహార భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఆహార భద్రత అధికారి శిరీష, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రవీందర్, జిల్లా విద్యశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఫుడ్ సేఫ్టీ అధికారి విక్రమ్ , తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణా స్టేట్ లెవెల్ బాయ్స్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు

**- ప్రథమ స్థానంలో నిలిచిన జోగులాంబ గద్వాల జట్టు**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 02:**

గ్రామం ఇంద్రపాలనగరం 45 వ తెలంగాణా స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ పోటీలలో ప్రథమ బహుమతి జోగులాంబ గద్వాల జట్టు గెలుచుకోగా, ద్వితీయ బహుమతి వికారాబాద్ జట్టు గెలుచుకుంది. తృతీయ స్థానం లో యాదాద్రి జట్టు నిలిచింది. గర్ధాస్ విక్రమ్ సర్పంచ్ చేతుల మీదుగా గెలిచిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగింది. మరియు ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ మెంబెర్ వరికుప్పల స్వామి,షూటింగ్బాల్ తెలంగాణా స్టేట్ జనరల్ సెక్రటరీ సి చ ఐలయ్య, యాదాద్రి దిష్టిక్ అధ్యక్షులు మోత్కూరి యాదయ్య, సెక్రటరీ మోత్కూరి మానస,వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు,స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ నిర్మల చేతుల మీదుగా బహుమతులు సర్టిఫికెట్ లు అందించడం జరిగింది. వివిధ జిల్లాల కోచ్లు,చంద్రమౌళి,స్కూల్ పీడీ మణి,క్రీడాకారులుమాట్లాడుతు మంచి ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కి ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమం లో సీనియర్ నాయకులు మందడి విద్యాసాగర్ రెడ్డి, రాజన్నగారి రమేష్, రవ్వ నర్సింహా, సింగణబోయిన జంగయ్య,ఈర్లపల్లి మల్లయ్య,గోల్లేపల్లి యాదయ్య,ఈర్లపల్లి రమేష్,గర్ధాస్ కరుణాకర్ ,జిట్టబోయిన వెంకటేష్,బోనగిరి సంజీవ,బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, గోగికార్ రాజుకుమార్,గర్ధాస్ వెంకటేష్, గర్ధాస్ శ్రీకాంత్, గడ్డం సాయి,కాటపల్లి నరేష్,గొర్ల నవీన్, గర్ధాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ కు ఆహ్వాన పత్రిక అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 02:**



ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో గెలిచిన కార్పొరేటర్లు, చైర్మన్,వైస్ చైర్మన్,మేయర్ లకు మార్చి 15న హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కప్పల(పరిటాల)రవి తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి హాజరుకావాలని భువనగిరి మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ తక్కెళ్ళపల్లి వాణి రవికుమార్ ని మున్సిపల్ ఆఫీసులో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారి విశ్వనాథం,సాల్వేరు బాలరాజు, బెల్లంకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటిదాకా ఒక లెక్క... ఇకపై మరో లెక్క

- ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు అడగొద్దు బాధితులను ఇబ్బంది పెట్టొద్దు
- బ్రోకర్లు, ఏజెన్సీల ద్వారా లంచాలు తీసుకుంటే ఇబ్బందులు తప్పవు
- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవు
- తప్పు చేస్తే మిమ్ముల్ని భగవంతుడు కూడా కాపాడలేరు
- మీరు నిజాయితీగా ఉంటే కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నేను తీసుకుంటా
- అవినీతికి అర్రులు చాచే వాళ్లకు ఇక్కడ తావు లేదు.... బదిలీపై వెళ్లొచ్చు
- మీపై రాజకీయ ఒత్తిళ్లు ఉండవు... బీజేపీ కార్పొరేటర్లు అవినీతికి చోటివ్వరు
- ఇతరులతో అంటకాగి తప్పు చేస్తే మీకే ముప్పు
- కరీంనగర్ లో ఇంటి నిర్మాణానికి ఈజీగా పర్మిషన్లు వస్తాయనే నమ్మకం కలిగించండి
- రాష్ట్రమంతా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు కరీంనగర్ స్ఫూర్తిగా నిలిచేలా పనిచేయండి
- టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవిన్యూ శాఖలపై తక్షణమే కార్పొరేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించండి
- టౌన్ ప్లానింగ్ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దిశా నిర్దేశం
- కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష
- కరీంనగర్ కు ఐకానిక్ గా నిలిచే ప్రాజెక్టులపై ప్రతిపాదనలు రూపొందించాలని సూచన
- కరీంనగర్ కార్పొరేషన్ లో మార్పుకు శ్రీకారం చుట్టిన బండి సంజయ్





**కరీంనగర్ వెలుతురు మార్చి 02:**

"ఒక్క ఛాన్స్ ఇవ్వండి. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి. మార్పు చూపిస్తా. అవినీతికి తావు లేకుండా కరీంనగర్ ను అభివృద్ధి చేస్తా." మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఇదే ప్రధాన అస్త్రంగా చేసుకుంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ప్రచారమిది. బండి సంజయ్ విజప్తికి సానుకూలంగా స్పందించిన కరీంనగర్ ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీకి అత్యధిక స్థానాలను అప్పగించి మేయర్ పీఠాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ఇచ్చిన మాటకు కట్టుబడి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రక్షాళనకు నడుం బిగించారు. అందులో భాగంగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి ఈరోజు ఉదయం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ, ఏసీపీలుసహా సిబ్బంది అంతా హాజరైన ఈ సమావేశంలో "ఇప్పటిదాకా ఒక లెక్క. ఇకపై మరో లెక్క. ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం డబ్బులు అడగొద్దు...బాధితులను ఇబ్బంది పెట్టొద్దు. అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చేలా చేయాల్సిందే. బ్రోకర్ల ద్వారా ఏజెన్సీలను పెట్టుకుని ప్రజలను వేధిస్తూ లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వాలనుకుంటే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదు. అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే బదిలీపై వెళ్లవచ్చు. నిజాయితీగా రూల్స్ ప్రకారం పనిచేసే వాళ్లపై మా రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. వాళ్లపై ఈగ కూడా వాలనివ్వను. కంటికి రెప్పలా కాపాడుకుంటా."అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఎమన్నారంటే.....

మిమ్ముల్ని బెదిరించడానికో, భయపెట్టడానికో పిలవలేదు. పూర్తి పారదర్శకతో పనిచేయాలి. మీరు నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేస్తూ ఇంటి పర్మిషన్ల కోసం మీ వద్దకు వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చే విషయంలో మీకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నా. మీరు తప్పు చేస్తే భగవంతుడు కూడా మిమ్ముల్ని కాపాడలేరు. మీపై రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా పట్టించుకోవద్దు. మా బీజేపీ కార్పొరేటర్ల నుండి ఒత్తిళ్లు రాకుండా నేను చూసుకుంటా. మీరు మాత్రం నిజాయితీగా ఉంటూ నిబంధనల ప్రకారం పనిచేయాల్సిందే. అట్లా చేస్తే మీపై ఈగను కూడా వాలనివ్వను. మిమ్ముల్ని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యతను పూర్తిగా నేనే తీసుకుంటా. రూల్స్ కు భిన్నంగా అధికార పార్టీతో అంటకాగుతూ అవినీతికి పాల్పడుతూ ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం నష్టపోయేది మీరే. ఇకపై మీ దగ్గరకు వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు. కసరుకోవద్దు. చిరునవ్వుతో పలకరించండి. వారికి నిబంధనలను వివరించి అందుకు అనుగుణంగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేలా సహకరించండి. అనుమతి ఇవ్వండి.

టౌన్ ప్లానింగ్ అంటేనే కరప్షన్ అనే భావన ప్రజల్లో పేరుకుపోయింది. ఇప్పటిదాకా ఒక లెక్క. ఇకపై మరో లెక్క. టౌన్ ప్లానింగ్ లో కరప్షన్ పై మీడియాలో వార్తలు వస్తే వెంటనే స్పందించాలి. తగిన చర్యలు తీసుకోవాలి. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే సులువుగా అనుమతి ఇవ్వాలే తప్ప రూల్స్ పేరుతో రకరకాల కొర్రీలు పెట్టి ప్రజలను ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకోవచ్చు. బ్రోకర్లతో, ఏజెన్సీలతో పని లేకుండా వాళ్లకు పైసలిచ్చుకునే పని లేకుండా ఈజీగా ఇంటి నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలి. అందుకోసం మున్సిపల్ ఆఫీసుకు వచ్చే ప్రజల కోసం "హెల్ప్ డెస్క్" తరహా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక పేరుతో డెస్క్ ను ఏర్పాటు చేయాలి. కరీంనగర్ మున్సిపల్ పాలక వర్గం మారింది. నెలరోజుల్లో కచ్చితంగా మార్పు కన్పించాలి. కొత్త పాలకవర్గం మార్క్ చూపాల్సిందే. కొంత మంది అధికారులు సొంతంగా బ్రోకర్లను, ఏజెన్సీలను ఏర్పాటు చేసుకుని వాళ్ల ద్వారా పనులు చేయిస్తూ పైసలు దండుకుంటున్నారు. ఇకపై అట్లా ఉండటానికి వీల్లేదు. అవినీతితో సంపాదించిన పాపపు సొమ్ము ఎక్కువ కాలం ఉండదు. మీ కుటుంబానికి ఆ సొమ్ము మంచిది కూడా కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎవరైనా ఇంకా అవినీతిని కొనసాగిస్తామనుకుంటే మాత్రం కరీంనగర్ లో ఉండటానికి వీల్లేదు. బదిలీపై వెళ్లొచ్చు. వాళ్లకు నేను సహకరించి బదిలీ చేయిస్తా.

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఏ విభాగంలో ఏ అధికారి ఏ విధంగా పనిచేస్తున్నారు? అవినీతికి పాల్పడుతున్నారా? అధికార పార్టీతో అంటకాగుతున్నారా? అనే విషయాలన్నీ నాకు తెలుసు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న నాకు ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటుంది. మున్సిపల్ అధికారులపై నిఘా ఉంటుంది. మీరేం చేస్తున్నారో పక్కా సమాచారం వస్తుంది. గతంలో మీరు ఏం చేశారో నాకు అనవసరం. ఇకపై మాత్రం అవినీతికి దూరంగా ఉండాలి. పనుల కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా అనుమతి ఇవ్వాలి. సహకరించాలి.

అనుమతి లేకుండా అనధికారికంగా ఇండ్లు, కమర్షియల్ భవనాలు నిర్మిస్తుంటే... ఆరంభంలోనే వాటిని ఆపాలి. నోటీసులివ్వాలి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం ఎన్ని నిర్మాణాలు అక్రమంగా, అనధికారికంగా కొనసాగుతున్నాయో గుర్తించి వాటన్నింటినీ వారం రోజుల్లోపు నోటీసులివ్వండి. నోటీసులకు సమాధానం ఇవ్వకపోయినా, అక్రమ నిర్మాణాలను కొనసాగించినా కొరడా ఝుళిపించండి. డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సహాయం వాటిని కూల్చివేయండి. ప్రభుత్వ స్థలాలను పూర్తిగా కాపాడాలి.

గతంలో కరీంనగర్ లో ఇంటి ముందు ఇసుక, కంకర కన్పిస్తే ఒకవైపు కార్పొరేటర్లు, ఇంకోవైపు టౌన్ ప్లానింగ్ అధికారులు వాలిపోయి బెదిరించి వసూళ్లు చేసే వాళ్లు. అలాంటి కార్పొరేటర్లను ప్రజలు తిరస్కరించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన వాళ్లలో 46 మంది కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లే ఉన్నారు. ముఖ్యంగా బీజేపీ కార్పొరేటర్లు అలాంటి వాటి జోలికి పోరు. ఇతర పార్టీల కార్పొరేటర్లు ఎవరైనా వాటికి అలవాటు పడితే రూల్స్ ప్రకారం వ్యవహరించండి. ఇకపై అలాంటి వాటికి తావు లేకుండా ఉండటం కోసం మూడు రోజుల్లోగా కార్పొరేటర్లు, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులతో "అవగాహన సదస్సు"ను ఏర్పాటు చేయండి. మళ్లీ చెబుతున్నా. మా నుండి మీపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చు. నెలరోజుల్లో మున్సిపల్ ఆఫీసులో మార్పు రావాలి. కరీంనగర్ లో ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే చాలా సులువుగా అనుమతి వస్తుందనే నమ్మకం ప్రజలకు రావాలి. ఆచరణలో చూపాలి. కరీంనగర్ స్ఫూర్తితో రాష్ట్రమంతటా టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులకు నాంది పలకాలి. ఆ విధంగా మీరు పనిచేసి చూపండి. కరీంనగర్ కు ఐకానిక్ గా ఉండే ప్రాజెక్టులు ఏమైనా ఉంటే చెప్పండి. వాటి అమలు కోసం, నిధుల కోసం నేను ప్రయత్నిస్తా. పెద్ద ఎత్తున సీఎస్సార్ ఫండ్స్ తీసుకొస్తా. అతి త్వరలోనే "అటల్ క్యాంటీన్" లను ఏర్పాటు చేసి ఆసుపత్రులు, మార్కెట్ కూడళ్లలో పేదలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని కడుపు నిండా పెట్టేలా చర్యలు తీసుకుంటా.

# కాంగ్రెస్ ప్రభుత్వం లో క్రీడలకు ప్రోత్సాహం లేదు...!

**- మోదీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి ఏటా పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్..**

**- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి**





**కరీంనగర్ వెలుతురు మార్చి 02:**

కాంగ్రెస్ ప్రభుత్వం లో క్రీడలకు ప్రోత్సాహం లేకుండా పోయిందని , మోడీ ప్రభుత్వం క్రీడాకారులను , క్రీడలను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవం క్రీడా పోటీల్లో బాగా మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో సోమవారం మానకొండూర్ జడ్పి పాఠశాల లో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుండి క్రీడాకారులను గుర్రాల వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి తో కలిసి పోటీలను ప్రారంభించారు. వాలీ బాల్, కబడ్డీ, ఖో ఖో తో పాటుగా అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభా పాఠవాలను చూపించిన వారికి విద్యా రంగాల్లో రిజర్వేషన్ లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడలతో దేహ దారుఢ్యం పెరిగుతుందని అన్నారు. పాఠశాల స్థాయి నుండే క్రీడల పై శ్రద్ధ చూపించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశ స్థాయిలో ప్రతీ నియోజకవర్గ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకు ఇటువంటి క్రీడలను నిర్వహించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం లో ఎంపీ లు ముందుకు కొనసాగుతున్నారని, ఆ దిశలోనే స్థానిక ఎంపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారం తో ఈ క్రీడలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్రీడాల నిర్వహణ పై జిల్లా సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ పర్యవేక్షణ చేశారు. ఇట్టి క్రీడలకు అంపైర్ లు గా సంపత్, అనిల్, శ్రీధర్, వెంకటేష్ అరవింద్ లువ్యవహారించారు. మానకొండూర్ అధ్యక్షులు కంది రాజేందర్ రెడ్డి, కేశవపట్నం అధ్యక్షులు ఎనుగుల అనిల్, తిమ్మాపూర్ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, గన్నేరువరం అధ్యక్షులు తిప్పర్తి నికేష్,జిల్లా నాయకులు భాషబోయిన ప్రదీప్, దూలం కిరణ్, బోనాల మోహన్, గడ్డం అరుణ్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, అశ్విన్, ఉషాకోయిల రమేష్, అరెల్లి శ్రీహరి,శీలం కుమార్ యాదవ్,వీరగోని రాజు, రేగూరి సుగుణాకర్, మాదాసు కుమార్, రాచమల్ల శ్రీనివాస్, సాయి లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టిబిజేపి జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తాను పరామర్శించిన ఖమ్మం జిల్లా బీజేపీ కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ

**ఖమ్మం, వెలుతురు మార్చి 2:**



ఖమ్మం జిల్లా బీజేపీ కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ టిబీజేపి జిల్లా అధ్యక్షుడు వందనపు సామ్రాట్ గుప్తాను ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రమాదం ఎలా జరిగిందో వివరాలు తెలుసుకున్న కొణతం లక్ష్మీ నారాయణ, సామ్రాట్ గుప్తాకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఎప్పుడూ చురుకుగా ఉండే జర్నలిస్ట్ నాయకుడుగా మరింత ఉత్సాహంతో తిరిగి కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు. అలాగే సామ్రాట్ గుప్తా కుమారుడు కూడా ప్రమాదానికి గురైన విషయం తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొంటూ, వైద్యుల సూచనల ప్రకారం విశ్రాంతి తీసుకుని పూర్తిస్థాయిలో కోలుకోవాలని కొణతం లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు.

# రామన్నపేట మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

**- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**





**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 02:**
మండలం పరిధిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేముల వీరేశం పలు గ్రామాల్లో శంకుస్థాపనలు నిర్వహించారు. నీర్నేముల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు మరియు సి.సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.నిధాన్ పల్లి గ్రామంలో సి.సి రోడ్డు మరియు మహిళా సమాఖ్య సంఘ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొమ్మాయిగూడెం గ్రామంలో సి.సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘం భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలకు శాశ్వత భవనాలు నిర్మించడం ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధి పట్ల తన కట్టుబాటును మరోసారి చాటిచెప్పిన ఎమ్మెల్యే కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

**-పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పోచం నారాయణ**



**మోత్కూర్, మార్చి 2,(వెలుతురు న్యూస్ ):**
ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా.... విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించి వారిలో పోటీ తత్వాన్ని పెంచేందుకు పూర్వ విద్యార్థుల సంఘం కృషి చేస్తుందని మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పోచం నారాయణ అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం మరియు భారతి ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ సంయుక్తంగా నగదు స్కాలర్షిప్ తో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. గత సంవత్సరం ఆరు నుండి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించారు . పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు పోచం కిష్టమ్మ ,సత్తయ్య జ్ఞాపకార్థం నగదు పురస్కారంను అందించారు .అదేవిధంగా 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు కొణతం రాధాబాయి కోదండరావు మెమోరియల్ తరఫున ప్రొఫెసర్ కొణతం చక్రధర్ రావు, కొణతం దామోదర్ రాయుడు గార్లు నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి గుజ్జ సోమ నరసయ్య కార్యవర్గ సభ్యులు మొగుళ్లపల్లి సోమయ్య ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర స్వామి కళ్యాణ తలంబ్రాలు బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్.ఎం..



**మోత్కూరు, మార్చి 02 (వెలుతురు ):**
భద్రాచలం సీతారామచంద్రస్వామి కళ్యాణ తలంబ్రాలు బుకింగ్ కార్యక్రమాన్ని సోమవారం మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్ లో రీజినల్ మేనేజర్ జాన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.మాట్లాడుతూ సీతారామ కళ్యాణ తలంబ్రాలు ప్రజలకు అందుబాటు ధరలో ఉన్నాయని కేవలం 151రూపాయలు చెల్లిస్తే టీ.జీ. ఎస్.ఆర్. టి.సి.ద్వారా నేరుగా ప్రజల ఇంటి వద్దకే కళ్యాణ తలంబ్రాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు కందుల విక్రాంత్, యాకు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీవో జనార్ధన్ రెడ్డి.



**మోత్కూరు, మార్చి 02 (వెలుతురు న్యూస్ ):**
యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి ని సోమవారం మండల పంచాయతీ అధికారుల సంఘం ( ఎంపీఓ) పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పైళ్ళ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా నాయకులు చంద్రశేఖర్, దినకర్, సలీం, శ్రీలత, కేదారీశ్వర్, పోలేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ.



**మోత్కూరు, మార్చి 02 (వెలుతురు న్యూస్ ):**
మోత్కూర్ మండలంలోని పాటిమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ గా చల్ల పల్లవి, డీఈఓ గా కొమ్ము మనీషా, డిప్యూటీ డిఈఓ గా పర్వతగిరి గ్రీష్మ , ఎమ్మెల్యేగా కురుమేటి శివ సాయి, ప్రధానోపాధ్యాయులుగా మొగులగాని మానస, ఉపాధ్యాయులుగా విద్యార్థులు తమ పాత్రలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత లక్షణాలు అలవార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కాముల లింగమల్లు, బండారు మల్లయ్య, దర్శనం వెంకన్న ,వంగూరి యాదయ్య, చిరుమర్తి యాదయ్య, కె.కవిత, డి తిరుపతి, కే కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# ఐలన్నకు లేదిక రంది... అండగ ఉన్నడు రాహుల్ గాంధీ...!!

**- డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కుటుంబసభ్యులతో కలిసిన ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**- ఇటు పార్టీ బలోపేతానికి, అటు ప్రభుత్వంలో బాగా పనిచేస్తున్నారు అంటూ ఐలయ్యకు రాహుల్ గాంధీ ప్రశంసలు**

**- ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో జిల్లాలో మంచి విజయం సాధించారంటూ ఐలయ్యకు అభినందనలు**

**- రాబోయే రోజుల్లో మీకు మంచి భవిష్యత్తు ఉందంటూ భుజం తట్టిన రాహుల్ గాంధీ**

**పుట్ట హనుమంత్**
**( సీనియర్ జర్నలిస్ట్ )**
**యాదగిరిగుట్ట , వెలుతురు ( మార్చి 2)**




వికారాబాద్ లో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలను బీర్ల ఐలయ్య రాహుల్ గాంధీకి వివరించారు. ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్ద ఎత్తున ఘన విజయం సాధించామని వివరించారు. వచ్చే ఎంపీటీసీ , జడ్పిటిసి ఎన్నికల్లో కూడా మరింత పెద్ద ఎత్తున ఘనవిజయం సాధిస్తామని రాహుల్ గాంధీకి ఐలయ్య తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని పెద్ద ఎత్తున బలోపేతం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, మరోసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని బీర్ల ఐలయ్య తెలిపారు. మిమ్మల్ని దేశ ప్రధానిగా చేసుకునే వరకు అలుపెరగకుండా శ్రమిస్తామని రాహుల్ గాంధీకి బీర్ల ఐలయ్య చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీర్ల ఐలయ్య తో మాట్లాడుతూ ప్రభుత్వ విప్ గా , ఎమ్మెల్యేగా మీరు అద్భుతంగా పనిచేస్తున్నారు అంటూ అభినందించారు. ఇటు ప్రభుత్వంలో బాగా పనిచేస్తూనే , అటు పార్టీ కోసం కూడా అద్భుతంగా కష్టపడుతున్నారని కొనియాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో మీరు సాధించిన విజయం అద్భుతం అని ప్రశంసించారు . స్థానిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించారని అభినందించారు . మున్ముందు కూడా ఇదే రకంగా పనిచేస్తూ పార్టీకి తిరుగులేని విజయాలను కట్టబెట్టాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం మరింతగా కష్టపడి పని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేస్తూ ఎల్లప్పుడూ నాయకులు, సామాన్య కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. ప్రభుత్వానికి మరింతగా మంచి పేరు తీసుకువచ్చేలా నిరంతరం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి అర్హులందరికీ అందించాలని రాహుల్ గాంధీ బీర్ల ఐలయ్యకు సూచించారు . ఇటు ప్రభుత్వంలో విప్ గా , ఎమ్మెల్యేగా అటు పార్టీలో డిసిసి అధ్యక్షులుగా మీరు శ్రమిస్తున్న తీరు అభినందనీయమని , రానున్న రోజుల్లో మీకు మంచి భవిష్యత్తు ఉంటుందంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బీర్ల ఐలయ్య బుజం తట్టి అభినందించారు. అనంతరం బీర్ల ఐలయ్య తన కుటుంబ సభ్యులను రాహుల్ గాంధీకి పరిచయం చేశారు. రాహుల్ గాంధీ ఐలయ్య కుటుంబ సభ్యులను ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీర్ల ఐలయ్య కూతుళ్ళు , కుమారుడిని రాహుల్ గాంధీ ఆశీర్వదించారు . తమకు భరోసా ఇచ్చి భుజం తట్టిన రాహుల్ గాంధీకి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

# మున్సిపల్ కార్మికులపై దాడులు అసహ్యం

**- దాడులకు పాల్పడితే తాట తీస్తాం...**

**- యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. నర్సిములు ఘాటు హెచ్చరిక...**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పర్మనెంట్ మరియు కాంట్రాక్ట్ కార్మికులపై దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. నర్సిములు హెచ్చరించారు. సోమవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉదయం నుంచి పట్టణ పరిశుభ్రత, తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యం, సౌకర్యాల కోసం కష్టపడుతున్న కార్మికులపై దాడులు జరగడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తున్న సమయంలో వారిపై దుర్భాషలాడడం, దాడులకు యత్నించడం అనేది అసహనీయమని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం వార్డ్ నంబర్ 9 చిన్న హైదరాబాద్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వాటర్ లైన్మెన్ పుర నరేష్ కుమార్‌పై ధరా రాజు అనే వ్యక్తి దుర్భాషలాడుతూ దాడికి యత్నించిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. బస్తీలో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత బస్తీ కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్ లేదా ఏఈ అధికారులను సంప్రదించాలని, కానీ నేరుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను లక్ష్యంగా చేసుకోవడం సమంజసం కాదని నర్సిములు స్పష్టం చేశారు. కార్మికుడిని దుర్భాషలాడుతూ ప్రాణహాని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల భద్రతను అధికారులు నిర్ధారించాలని కూడా కోరారు. రాబోయే రోజుల్లో కార్మికులపై దాడులు పునరావృతమైతే మున్సిపల్ కార్యాలయం ముందు విధుల బహిష్కరణ చేపట్టి పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని యూనియన్ హెచ్చరించింది. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# మల్లి గ్రామ శివారులో అక్రమ పశుమాంసం ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి

**- ఫ్యాక్టరీ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝన్యాల్కల్ మండలం మల్లి గ్రామ శివారులో అక్రమంగా కొనసాగుతున్న పశువధ మరియు పశుమాంసం ఫ్యాక్టరీపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ కార్యకలాపాల కారణంగా గ్రామంలో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తూ ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజల ప్రకారం, ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. దుర్వాసనతో పాటు ఈగలు, కుక్కలు అధికంగా సంచరిస్తూ చిన్నపిల్లలకు, మహిళలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అక్రమంగా నడుస్తున్న ఈ ఫ్యాక్టరీ యజమాని అబ్దుల్ హాఫీజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వెంటనే ఫ్యాక్టరీని మూసివేయాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సంబంధిత శాఖలు తక్షణ తనిఖీలు నిర్వహించి, చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.





# మంకల్ సుభాష్ సతీమణి సుజాత అంత్యక్రియల్లో రాజకీయ, సామాజిక ప్రముఖుల నివాళి

**జహీరాబాద్ వెలుతురు మార్చి 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ మంకల్ సుభాష్ సతీమణి సుజాత అంత్యక్రియలు సోమవారం శోకసంద్రంలో నిర్వహించబడ్డాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు మరియు పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు భారీగా హాజరై సుజాత పార్థివ దేహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ హాజరై మంకల్ సుభాష్ ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుజాత గారి మరణం కుటుంబానికి తీరని లోటని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ మొహమ్మద్ యూనుస్, కౌన్సిల్ సభ్యులు జాంగిర్ అక్రమ్, మాజీ కౌన్సిలర్ మోతిరం సతీష్ సెట్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సుజాత గారు సాదాసీదా జీవనం గడిపిన, అందరితో ఆప్యాయంగా మెలిగిన వ్యక్తి అని పలువురు నాయకులు స్మరించుకున్నారు. అంత్యక్రియలు స్థానిక స్మశానవాటికలో సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించబడ్డాయి.

# ఘనంగా శ్రీపాదరావు జయంతి నిర్వహించిన జిల్లా కలెక్టర్.

**కరీంనగర్ వెలుతురు మార్చి 02:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ బస్టాండ్ చౌరస్తాలో గల శ్రీపాదరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ సహా పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# భక్తి మార్గమే శాంతికి మార్గం...!

**- మహామండలేశ్వర సిద్ధేశ్వరానందగిరి...**

**- వైభవంగా కొనసాగుతున్న 37వ పాదయాత్ర...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 02:**



భక్తి మార్గము మనసుకు ప్రశాంతతను అందించే పవిత్రమైన మార్గమని సిద్ధేశ్వరానందగిరి మహామండలేశ్వర స్వామి పేర్కొన్నారు. దైవస్మరణ, జపం, ధ్యానం వంటి ఆధ్యాత్మిక ఆచరణలు మనలోని ఆందోళనలను తగ్గించి మనశ్శాంతిని కలిగిస్తాయని ఆయన ఉపన్యసించారు. భక్తి మార్గంలో నడిచే వారు ద్వేషం, అహంకారం వంటి దుర్గుణాలను దూరం చేసుకుని ప్రేమ, సహనం, క్షమ వంటి సద్గుణాలను పెంపొందించుకుంటారని తెలిపారు. అందుకే భక్తి మార్గమే నిజమైన శాంతి మార్గమని స్పష్టం చేశారు. బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ సమక్షంలో శ్రీ దత్తగిరి మహారాజ్ వారి 47వ వార్షిక అమరతిథి సందర్భంగా నిర్వహిస్తున్న 37వ పాదయాత్రపల్లకి సేవ రథయాత్ర ఐదవ రోజు వైభవంగా సాగింది. సోమవారం ఉదయం మహాబత్‌పూర్ నుండి ప్రారంభమైన యాత్ర రాయికోడ్ క్రాస్ రోడ్, శంశోద్దీన్‌పూర్, న్యాల్కల్, మిర్జాపూర్, ముంగి, రుక్మాపూర్ గ్రామాల మీదుగా హద్నూర్ దత్తగిరి ఆశ్రమానికి రాత్రికి చేరుకుంది. మధ్యాహ్నం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో భక్తులు విరామం తీసుకుని భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మళ్లీ ప్రారంభమైన రథయాత్రకు గ్రామస్తులు నిండు కలశాలతో, మహిళల కోలాటాలతో, భజన సంకీర్తనలతో ఘన స్వాగతం పలికారు. యాత్రలో మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల ఉత్సాహం, ఆధ్యాత్మిక భావోద్వేగం గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాయికోడ్, హద్నూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది యాత్రికులకు ప్రథమ చికిత్స మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజశ్రీ నందిని మాత, విశ్వగిరి మహారాజ్, రాజశేఖర్ గౌడ్, విట్టల్, రవి, రామ్ రెడ్డి, మల్లయ్య, ఎం. రాజ్‌కుమార్, బి. విజయ్‌కుమార్, విట్టల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సంగారెడ్డి తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మోకిల గ్రామంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమిపై ఆక్రమణ యత్నం హాస్పిటల్, ఫ్లాటెడ్ ప్రాజెక్ట్‌కు కేటాయించిన స్థలాన్ని రక్షించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**శంకర్పల్లి వెలుతురు మార్చి 2 :**

శంకర్పల్లి మండలం మోకిల గ్రామ పంచాయతీ పరిధిలోని 31వ సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమిపై ప్రైవేట్ వ్యక్తుల ఆక్రమణ యత్నం జరుగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొత్తం 2 ఎకరాలు 20 గుంటల మిగులు భూమిని గత గ్రామ పంచాయతీ పాలకవర్గం భవిష్యత్తు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా హాస్పిటల్ మరియు ఫ్లాటెడ్ నిర్మాణం కోసం కేటాయిస్తూ తీర్మానం చేసినట్లు సమాచారం. అయితే, అదే భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన అసైన్‌మెంట్ భూమి ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోతే గ్రామాభివృద్ధి ప్రణాళికలు దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, తక్షణమే విచారణ చేపట్టి భూమిని రక్షించాలని కోరుతున్నారు. అలాగే, గత పాలకవర్గం తీసుకున్న తీర్మానానికి అనుగుణంగా హాస్పిటల్ మరియు ఫ్లాటెడ్ నిర్మాణ పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

## భూదాన్ ఆశయం.. రియల్ ఎస్టేట్ మాఫియా మాయాజాలం!

**ఖమ్మం, మార్చి2( వెలుతురు):**

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలకు కంచుకోట.. ఇప్పుడు అదే జిల్లా ఆక్రమణల కూల్చివేతలతో అట్టుడుకుతోంది. నగర శివారులోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో ఉన్న 'వినోబా నవోదయ కాలనీ'లో గురువారం రెవెన్యూ అధికారులు చేపట్టిన భారీ కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. సుమారు 650 ఇళ్లను జేసీబీలతో నేలమట్టం చేయడంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి.మూడు జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 1,000 మంది పోలీసుల పహారాలో, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సమక్షంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లోని సామాన్లు సర్దుకోవడానికి కూడా సమయం ఇవ్వలేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇళ్లు కూల్చవద్దని మహిళలు, వృద్ధులు జేసీబీల ముందు అడ్డంగా పడుకున్నా అధికారులు వెనక్కి తగ్గలేదు. కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే భూదాన్ ఉద్యమ స్ఫూర్తితో దాతలు ఇచ్చిన ఈ భూమి ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది.విలువ: కొత్త కలెక్టరేట్ సమీపంలో ఉండటంతో ఇక్కడి భూమి విలువ ఎకరాకు ?10 కోట్లు పలుకుతోంది. మొత్తం 30 ఎకరాలకు పైగా ఉన్న ఈ భూమి విలువ సుమారు ?300 కోట్లు ఉంటుందని అంచనా.ఇది భూదాన్ బోర్డుకు చెందిన ప్రభుత్వ భూమి అని, హైకోర్టు ఆదేశాల మేరకే ఆక్రమణలు తొలగిస్తున్నామని రెవెన్యూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దళారులు నకిలీ పత్రాలతో పేదలను నమ్మించి ఇక్కడ చేర్పించారని వారు చెబుతున్నారు.ఈ ఘటనపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వీరికి నల్లా కనెక్షన్లు, విద్యుత్ మీటర్లు ఇచ్చారని, ఇప్పుడు రేవంత్ సర్కార్ ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని కేటీఆర్ విమర్శించారు. నేడు ఆయన బాధితులను పరామర్శించనున్నారు. భూమాఫియా నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే తమ ఉద్దేశమని అధికార పార్టీ నేతలు అంటున్నారు. అయితే, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం చేస్తామని భరోసా ఇస్తున్నారు."ఓట్ల సమయంలో మా దగ్గరకు వచ్చి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు, ఇప్పుడు మంత్రులుగా ఉండి మమ్మల్ని ఎందుకు రోడ్డున పడేశారు?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షంలో శిథిలాల మధ్యే తమ సామాన్లతో తలదాచుకుంటున్న బాధితుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. ప్రభుత్వం కేవలం భూమి విలువను మాత్రమే కాకుండా, అక్కడ దశాబ్దాలుగా బతుకుతున్న పేదల జీవితాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పౌర సమాజం కోరుతోంది. రాజకీయ చదరంగంలో పేదవాడి సొంతింటి కల బలికావొద్దని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో తగ్గిన చార్జీలు




**హైదరాబాద్, మార్చి2( వెలుతురు):**

వేసవికాలంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో టికెట్ల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1వ తేదీ నుంచి తగ్గించిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే సమ్మర్ మొదలుకావడంతో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కబోత కూడా మొదలుకాబోతుంది. దీని వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేందుకు హైదరాబాద్‌లో తిరిగే ఏసీ బస్సుల్లో టికెట్ల రేట్లను తగ్గించారు. దీంతో ప్రజలపై భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో హాయిగా ఏసీ బస్సు ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు. ఏయే బస్సుల్లో ఎంత తగ్గించారు.. తగ్గించిన తర్వాత ఛార్జీలు ఎలా ఉన్నాయి అనే విషయాలు తెలుసుకుందాం.గతంలో మెట్రో డీలక్స్ ఏసీ బస్సుల్లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు టికెట్ ఛార్జీ రూ.30గా ఉండేది. కానీ ఇప్పుడు రూ.25కి తగ్గింది. దీంతో ప్రతీ నాలుగు కిలోమీటర్ల ప్రయాణంపై రూ.5 మేర తగ్గింపు మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని టీజీఎస్ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో గతంలో నాలుగు కిలోమీటర్లకు రూ.35 చొప్పున ఉండగా.. ఇప్పుడు రూ.25కి తగ్గనుంది. ఏకంగా రూ.10 మేర తగ్గనుండటం ప్రయాణికులకు ఊరటగా చెప్పవచ్చు. ఎండాకాలంతో పాటు ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ నిండుగా ఉండటం లేదు. ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ ఉంటుంది. ధరలు ఎక్కువగా ఉంటాయనే కారణంతో కొంతమంది వెనకడుగు వేస్తున్నారు. ఛార్జీలను తగ్గించడం వల్ల ఆక్యుపెన్సీ పెరగడంతో పాటు సమ్మర్‌లో ప్రయాణికులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది.1 నుంచి 3 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలర్స్ బస్సుల్లో 0 నుంచి రూ.10 వరకు ఆదా కానుండగా.. ఈ-మెట్రో బస్సుల్లో 5 నుంచి రూ.10 తగ్గుతుంది. ఇక 4-15 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.5 నుంచి రూ.10, ఈ-మెట్రో బస్సుల్లో రూ.10 నుంచి రూ.15 ఆదా అవుతుంది. ఇక 16 నుంచి 21 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.10 నుంచి రూ.15, ఈ-మెట్రో బస్సులలో రూ.10 నుంచి రూ.15, 22-30 కిలోమీటర్ల ప్రయాణానికి మెట్రో డీలక్స్,ఈ మెట్రో ఏసీ బస్సుల్లో రూ.5 నుంచి రూ.10 వరకు ఆదా అవుతుంది. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 275 మెట్రో డీలక్స్, 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఛార్జీల తగ్గింపుతో నగర ప్రజలకు లబ్ది చేకూరనుంది.

## తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ డైరీ మరియు క్యాలెండర్ 2026 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించిన టీఎన్జీవో

**హైదరాబాద్ వెలుతురు మార్చి 02:**

నాంపల్లి, హైదరాబాద్‌లోని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ భవన్‌లో సోమవారం రోజున తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ డైరీ మరియు క్యాలెండర్ 2026 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ మరియు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాష్ అధ్యక్షత వహించారు. కేంద్ర సంఘ గౌరవ అధ్యక్షులు మారాం జగదీష్, ప్రధాన కార్యదర్శి ఎస్.ముజీబ్ హుసైని ముఖ్య అతిథులుగా విచ్చేసి డైరీ మరియు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారికి





ఘన సన్మానం నిర్వహించబడింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ .., ఉద్యోగుల ఐక్యతే సంఘ బలం అని, 2026 సంవత్సరంలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి మరియు సమస్యల పరిష్కారానికి సంఘం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. సేవాభావంతో సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అదే కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినులందరూ 06-03-2026 తేదీన ఉదయం 10.00 గంటలకు, కోటి లోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ సభా మందిరంలో నిర్వహించబడనున్న మహిళా దినోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఘనవిజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. మహిళల సాధికారత, పరిపాలనలో వారి విశిష్ట పాత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు శామ్యూల్ పాల్, కార్యదర్శి బి. భరత్ కుమార్, కోశాధికారి శ్రీ శేష సాయి గిరికాంత్, కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు, సెంట్రల్ పబ్లిక్ సెక్రటరీ శైలజ, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్, జిల్లా కార్యదర్శి కటారి శ్రీనివాస్, గ్రౌండ్ వాటర్ ఫోరం అంజనా, సెంట్రల్ ఫోరం ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కుమార్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, ఉపాధ్యక్షులు జేమ్స్ దాస్ ఉపాధ్యక్షురాలు రజని, సంయుక్త కార్యదర్శి అశ్విని, ప్రచార కార్యదర్శి కొండల్ రావు, క్రీడల కార్యదర్శి కె. వేణుగోపాల్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు కార్తిక్, కార్యదర్శి ఎల్. అక్షయ్ కుమార్, మేడ్చల్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, మల్కాజిగిరి యూనిట్ అధ్యక్షురాలు ఎస్. అరుణ, షామీర్‌పేట్ యూనిట్ అధ్యక్షులు రవి యాదవ్, కార్యదర్శి షాలీ షాహివామ్, కుత్బుల్లాపూర్ యూనిట్ అధ్యక్షురాలు నసీమ, కార్యదర్శి సత్య జ్యోతి, ఘట్‌కేసర్ యూనిట్ అధ్యక్షులు రవీందర్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మాణిక్యం, సీనియర్ సలహాదారు సంజయ్ సింగ్, సభ్యులు ఉమాకాంత్, కిరణ్, కిశోర్, శివకుమార్, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. మరియు వివిధ యూనిట్లు, ఫోరంల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 7న పెద్ద స్టీల్ ప్లాంట్ ప్రారంభం

**విశాఖపట్టణం, మార్చి2( వెలుతురు):**

ఏపీలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి దగ్గర మార్చి 7న ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు మిట్టల్ సంస్థ ట్వీట్ చేసింది. రూ.1.35 లక్షల కోట్లతో.. రూ.2,200 ఎకరాల్లో ఈ స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ కంపెనీలు, పరిశ్రమలు క్యూకట్టాయి.. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇప్పుడు ఒక్కొక్క పరిశ్రమకు సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. తాజాగా మరో ప్రతిష్టాత్మక సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన కోసం ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఏఎంఎన్ఎస్ (ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా) సంస్థ అనకాపల్లి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మార్చి 7న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏఎంఎన్ఎస్ యాజమాన్యం శంకుస్థాపనకు సంబంధించిన వివరాలను 'ఎక్స్' ద్వారా ప్రకటించింది.చాలా కాలంగా ఆసక్తిగా ఎదురు




చూస్తున్నామంటూ ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పేర్కొంది. ట్వీట్‌లో శంకుస్థాపనకు సంబంధించి కంపెనీ ఫోటోతో పాటుగా, గూగుల్ మ్యాప్, ఇతర వివరాలను కూడా ప్రస్తావించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు హాజరవుతారనే చర్చ జరుగుతోంది.. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న నక్కపల్లి మండలంలో ప్రాంతాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటుగా అధికారులు పరిశీలించారు. ఈ మేరకు అక్కడ భద్రతా ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్‌ను దాదాపు రూ.1.35 లక్షల కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఈ భారీ పరిశ్రమను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన భూమిని ఏపీ ప్రభుత్వం కేటాయించింది. ఎకరా రూ.51,39,690 ధరకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కోసం తొలిదశలో 2,200 ఎకరాలు కేటాయించారు. అంతేకాదు ఏపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రాయితీలు, ప్రోత్సాహకాలతో ప్యాకేజీ కూడా ప్రకటించింది. అయితే ఈ స్టీల్ ప్లాంట్ తొలిదశ ప్రాజెక్టు పురోగతిని బట్టి రెండోదశ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ఉంటుంది. మొత్తం మీద ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మరో ముందడుగు పడబోతోంది.

## అమరావతి రైల్వే లైన్ కు నిధులు.. 2047 కోట్లు.. 57కిమీ దూరం..!

**విజయవాడ, మార్చి2( వెలుతురు):**

రైల్వే డిపార్ట్మెంట్, ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న అమరావతి రైల్వే లైన్ కోసం తెలంగాణ రైతుల నుంచి భూసమీకరణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ -తెలంగాణ బోర్డర్‌లోని ఎర్రుపాలెం గ్రామం పరిధిలోని రైతులు అమరావతి రైల్వే లైన్ కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే దీనికోసం రైల్వే అధికారులు ఎర్రుపాలెం గ్రామస్తులతో పలు దఫాలు చర్చలు జరుపగా దాదాపు అందరూ ఒప్పుకొన్నట్టు అక్కడి స్థానికుడు, అడ్వకేట్ శ్రీనివాస్ తెలిపారు. నిజానికి ఈ ప్రాజెక్ట్‌లో సంక్లిష్టమైన భాగం ఈ భూ సేకరణ అని రైల్వే భావించింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నుంచి ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ సేకరికంచిన భూమి ఉంది. కానీ తెలంగాణలోని ఎర్రుపాలెంలో భూములు అమరావతి రైల్వే లైన్ కోసం ఇస్తారా అని అందరూ అనుమానించారు కానీ తెలంగాణ రైతులు మాత్రం దానికి దాదాపు అంగీకరించడంతో ఈ కొత్త రైల్వే లైన్‌కి అడుగు ముందుకు పడినట్టు అయింది.ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం గ్రామానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడికి సమీపంలో ఉన్న జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైంది. ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయినప్పటికీ ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో పెద్దగా రైళ్లు ఆగవు. విజయవాడ -భద్రాచలం రోడ్డు మెము, విజయవాడ -డోర్నకల్ ప్యాసింజర్, గోల్కొండ ఎక్స్ ప్రెస్, కృష్ణా ఎక్స్ ప్రెస్ మాత్రమే ఇక్కడ రోజూ ఆగుతాయి. ఈ నాలుగు కాకుండా వారానికి రెండుసార్లు ప్రయాణించే చెన్నై -లక్నో ఎక్స్ ప్రెస్‌కి ఈ స్టేషన్‌లో హాల్ట్ ఉంది. చాలా రోజులుగా ఎర్రుపాలెం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పద్మావతి, శాతవాహన, విజయవాడ




-సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్‌లను ఎర్రుపాలెం స్టేషన్‌లో ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అది ఒక డిమాండ్ గానే ఉండిపోతూ వచ్చింది. అమరావతి బైపాస్ రైల్వే లైన్ ఈ స్టేషన్ నుంచే ప్రారంభం అవుతుందని రైల్వే ప్రకటించడంతో ఎర్రుపాలెం వాసుల మైండ్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ లైన్ వల్ల ఎర్రుపాలెం స్టేషన్ హోదా మారి జంక్షన్ అవుతుంది. దానివల్ల అమరావతి వైపు వెళ్లే కొత్త రైళ్ళతోపాటు ఆల్రెడీ ఉన్న కొన్ని అదనపు రైళ్ళకు కూడా ఈ స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చి తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఊరు కూడా డెవలప్ అవుతోందని ఇక్కడి రైతులు భావిస్తున్నట్టు రెడ్డి అనే మరో గ్రామస్తుడు తెలిపారు. మొదట కాస్త ఇబ్బందిగా ఫీల్ అయినా మూడు నాలుగు దఫాల మీటింగ్స్ తర్వాత తమ భూములు కొత్త రైల్వే లైన్ కోసం ఇవ్వడానికి ఇక్కడి రైతులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూములు మార్కెట్ ధరలకు మూడు రెట్లు పరిహారం లభించనున్నట్టు కొందరు గ్రామస్తులు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ భూములను ఇవ్వడానికి వీరు ఒప్పుకొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూసేకరణ జరగాల్సి ఉన్నా అది పెద్దగా సంక్లిష్టం కాదు. ఆల్రెడీ అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూమి ఉంది. ఇది కాక మరికొన్ని గ్రామాల్లో భూసేకరణ జరగాల్సి ఉన్నా ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ ఆ పనిలో ఉంది. రైల్వే పరంగా కృష్ణా నదిపై నిర్మించాల్సి ఉన్న కొత్త బ్రిడ్జి ఒక్కటే పెద్ద పని. ఈ ప్రాజెక్ట్ కోసం 2047 కోట్ల బడ్జెట్ కేటాయించింది రైల్వే. దీనికి 2024లోనే అప్రూవల్ వచ్చేసింది. తెలంగాణాలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రుపాలెం నుంచి ఏపీ లోని గుంటూరు జిల్లాకు చెందిన నంబూరు వరకూ అమరావతి రైల్వే లైన్ నిర్మిస్తారు. ఈ రెండు స్టేషన్‌ల మధ్య కొత్తగా 10 స్టేషన్‌లు రానుండగా వాటిలో ఏపీ రాజధాని అమరావతి ఒకటి. 2029 జనవరి నాటికి ఈ రైల్వే లైన్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు జరుగుతున్నాయి. త్వరలోనే భూసేకరణ పూర్తి చేసి ఈ రైల్వే లైన్ నిర్మాణానికి శంఖు స్థాపన చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది.

## ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థిపై అఘాయిత్యం

**- తోటి విద్యార్థు అత్యాచారం**

**- పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు**

**హైదరాబాద్, మార్చి2( వెలుతురు):**

మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు చర్యాలు తీసుకుంటున్నప్పటికీ దారుణాలకు అడ్డుకట్టపడడం లేదు. అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్స్, పోలీస్ డిపార్ట్ మెంట్ అవగాహన కల్పిస్తున్నప్పటికీ మాయమాటలకు మోసపోతున్నారు కొందరు యువతులు. తాజాగా బాచుపల్లిలోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో దారుణం చోటుచేసుకుంది. తోటి విద్యార్థినీ పై ఇద్దరు యువకులు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలితో చనువుగా ఉన్న ఆసిస్ విద్యార్థి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు బాధితురాలు తెలిపింది. ఏడాది నుంచి ఆసీస్ అఘాయిత్యం చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆసీస్ తో పాటు ప్రవీణ్ అనే వ్యక్తి తనపై మిస్ బిహేవ్ చేసినట్లు ఫిర్యాదుల పేర్కొన్నది బాధితురాలు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. బాధితురాలు బిటెక్ ÷నైల్ ఇయర్ చదువుతుండగా ఇరువురు యువకులు సహ-విద్యార్థులుగా సమాచారం. నా పై ఇద్దరు నా క్లాస్ మేట్స్ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆసీస్ అనే స్టూడెంట్ నన్ను ప్రేమ పేరుతో వేధించాడు.. నన్ను భయపెట్టాడు నాతో చనువుగా ఉన్నప్పుడు ఆసీస్ వీడియోస్ ఫొటోస్ తీసి బెదిరించాడు..



నన్ను క్లాస్ రూమ్ లోనే అత్యాచారం చేశాడు.. ఏడాది నుంచి ఆసీస్ అనే స్టూడెంట్ నాపై అత్యాచారం చేశాడు.. ఆసీస్ తో పాటు ప్రవీణ్ అనే స్టూడెంట్ తనపై మిస్ బిహేవ్ చేశారు.. నాకు మత్తు పదార్థం ఇచి ఓయో రూమ్స్ తీసుకువెళ్లి ఆసీస్ అత్యాచారానికి పాల్పడ్డాడు.. నేను స్పృహలో లేనప్పుడు వీడియోస్ ఫొటోస్ తీసి నన్ను బ్లాక్ మెయిల్ చేశాడు.. నాకు జరిగిన అన్యాయాన్ని పేరెంట్స్ దృష్టికి తెచ్చాను.. మా పేరెంట్స్ కాలేజ్ మేనేజ్మెంట్ ను ప్రశ్నించారు.. కాలేజ్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు.. దీంతో బాచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాము.. మేము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నరు బాచుపల్లి పోలీసులు.. ఫిబ్రవరి 28న ఎఫ్ఐఆర్ నమోదయింది.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.. మాకు న్యాయం జరగాలి' అని బాధితురాలు తన గోడు వెల్లబోసుకుంది.

# వైద్యం సేవనా? వ్యాపారమా?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*హైదరాబాద్‌లోని ఒక సన్నని గల్లీ. పాత బస్తీకి సమీపంలో ఉన్న ఒక చిన్న అద్దె గది. అక్కడ ఒక పేద కూలీ కుటుంబం నివసిస్తోంది. ఆ రోజంతా కష్టపడి పని చేసి అలసిపోయి వచ్చిన తండ్రికి అర్ధరాత్రి ఒక్కసారిగా ఛాతిలో నొప్పి మొదలైంది. చెమటలు పడుతున్నాయి, శ్వాస అందడం లేదు. అది గుండెపోటు అని ఆ కుటుంబానికి అర్థం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. హుటాహుటిన దగ్గర్లో ఉన్న ఒక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ అక్కడ వినిపించిన మాట ఆశని నిరాశ చేసింది ఇక్కడ బెడ్ ఖాళీ లేదు, వేరే చోటికి తీసుకెళ్లండి. సమయం మించిపోతోంది. ప్రాణం మీదికి వస్తోందని భయపడి, అప్పుసొప్పు చేసి అయినా సరే బతికించుకోవాలని ఒక కార్పొరేట్ ప్రైవేట్ హాస్పిటల్‌కు పరుగు తీశారు. అక్కడ రిసెప్షనిస్ట్ ముఖంపై ఎలాంటి భావం లేకుండా నిర్లిప్తంగా ఒక మాట అంది ముందు యాభై వేలు డిపాజిట్ కట్టండి, అప్పుడే అడ్మిషన్ దొరుకుతుంది. ఆ కుటుంబం దగ్గర కనీసం ఐదు వేలు కూడా లేవు. కాళ్ళవేళ్ళా పడ్డా ఆ యాజమాన్యం కరగలేదు. డబ్బు లేకుండా లోపలికి రానివ్వం అన్న కఠిన స్వరాల మధ్య, ఆ తండ్రి ప్రాణం ఆ హాస్పిటల్ వరండాలోనే గాలిలో కలిసిపోయింది. ఇది ఏదో సినిమా కథో, రచయిత కల్పనో కాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని గల్లీ గల్లీలో ప్రతి నెలా ఇలాంటి విషాద గాథలు వందలాదిగా జరుగుతున్నాయి.*

ఒకప్పుడు సేవగా భావించిన వైద్యం, ఇప్పుడు కేవలం కొనుగోలు చేయగలిగే ఒక ఖరీదైన సరుకు గా మారిపోయింది. మనిషి ప్రాణం విలువ అతని బ్యాంక్ బ్యాలెన్స్‌తో, అతను కట్టగలిగే డిపాజిట్‌తో కొలవబడుతున్న కాలంలో మనం జీవిస్తున్నాం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా ఉండేది. కానీ కాలక్రమేణా, ముఖ్యంగా 1990వ దశకంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల తర్వాత, ఆరోగ్య రంగంపై ప్రభుత్వ పట్టు సడలుతూ వచ్చింది. ప్రైవేట్ రంగం విపరీతంగా పుంజుకుంది. నేడు మన దేశంలో దాదాపు 70 శాతానికి పైగా ఆరోగ్య సేవలు ప్రైవేట్ ఆసుపత్రుల చేతుల్లోనే ఉన్నాయి. ప్రైవేట్ రంగం రావడం వల్ల అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చి ఉండవచ్చు, కానీ అందరికీ ఆరోగ్యం అనే నైతిక బాధ్యత మాత్రం ఎక్కడో మరుగున పడిపోయింది. ప్రస్తుత కార్పొరేట్ హాస్పిటల్స్ అన్నీ లాభాలే పరమావధిగా నడుస్తున్నాయి. రోగి ఆసుపత్రి మెట్లు ఎక్కగానే, వైద్యులు అతని వ్యాధి తీవ్రతను చూడటం కంటే ముందు, రిసెప్షన్ వద్ద అతని ఇన్సూరెన్స్ కార్డ్ ఏది? అతను ఎంత చెల్లించగలడు? అనే విషయాలనే ఆరా తీస్తారు. ఇది వైద్య వృత్తికే మాయని మచ్చ. రోగి ప్రాణం కంటే లాభమే ముఖ్యమనుకునే ఈ ధోరణి సమాజానికి ఒక పెద్ద శాపంలా మారింది. తెలంగాణలో జరిగిన ఒక లోతైన అధ్యయనం ప్రకారం, ఒక సాధారణ అపెండిక్స్ ఆపరేషన్ లేదా పిత్తాశయ శస్త్రచికిత్సకు ప్రైవేట్ ఆసుపత్రులు రూ. 80,000 నుండి రూ. 2,00,000 వరకు వసూలు చేస్తున్నాయి. ఇదే చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తుంది. అయినప్పటికీ, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడానికి భయపడుతున్నారు. కారణం అక్కడ మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం, మరియు సకాలంలో స్పందించని వ్యవస్థ. ఈ లోపాలే సామాన్యుడిని బలవంతంగా ప్రైవేట్ ఆసుపత్రుల కబంద హస్తాల్లోకి నెడుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అక్రమ వసూళ్లు ఒక మాఫియాలా విస్తరించాయి. రోగి కోలుకుంటున్నాడా లేదా అన్నది పక్కన పెడితే, బిల్లు మాత్రం రోజురోజుకూ లక్షల్లోకి చేరుతుంది. కొన్ని సందర్భాల్లో రోగి మరణించినా, పూర్తి బిల్లు చెల్లించే వరకు మృతదేహాన్ని అప్పగించని అమానవీయ ఘటనలు మనం చూస్తూనే ఉన్నాం. ఇది చట్టరీత్యా నేరమైనా, క్షేత్రస్థాయిలో మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ గతంలో కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులపై జరిపిన విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రోగుల నుండి డబ్బులు గుంజడానికి ప్రధానంగా మూడు మార్గాలను వాడుతున్నారు, రోగ నిర్ధారణకు అవసరం లేకపోయినా, స్కానింగ్‌లు, ఖరీదైన రక్త పరీక్షలు పదే పదే చేయించడం. తక్కువ ధరలో దొరికే జెనరిక్ మందుల స్థానంలో, భారీ కమిషన్లు వచ్చే అత్యంత ఖరీదైన బ్రాండెడ్ మందులను మాత్రమే సిఫార్సు చేయడ సాధారణ వార్డులో చికిత్స అందించే అవకాశం ఉన్నా, ఎక్కువ బిల్లు వేయడం కోసం రోగిని ఐదు ఆరు రోజులు అదనంగా ఐసీయూ లో ఉంచడం.






హైదరాబాద్‌కు చెందిన సావిత్రమ్మ అనే మహిళ తన భర్త చికిత్స కోసం ఎదుర్కొన్న అనుభవం కళ్లు చెమరుస్తుంది. నా భర్త ఐసీయూ లో మూడు రోజులు ఉన్నాడు. రోజుకు రూ. 15,000 అవుతుందని చెప్పారు. కానీ చివరకు బిల్లు చూస్తే రూ. 95,000 వేశారు. దేనికి ఎంత వేశారో అడిగితే అర్థం కాని టెక్నికల్ పదాలు చెబుతున్నారు. చివరకు నాకున్న ఒక్కగానొక్క ఇంటిని తాకట్టు పెట్టి ఆ డబ్బు కట్టాల్సి వచ్చింది అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇది ఒక్క సావిత్రమ్మ కథ కాదు, మన తెలుగు నేల మీద రోజూ జరుగుతున్న లక్షలాది కుటుంబాల దైన్యం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి పౌరుడికి జీవించే హక్కును కల్పించింది. సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో ఆరోగ్య హక్కు కూడా జీవించే హక్కులో భాగమేనని స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ పీడియాట్రిక్ సొసైటీ జం రాష్ట్ర ప్రభుత్వం కేసులో, ప్రభుత్వం నిధుల కొరతను సాకుగా చూపి పౌరులకు వైద్య సదుపాయాలు నిరాకరించకూడదు అని కోర్టు తీర్పునిచ్చింది. అయితే, ప్రైవేట్ ఆసుపత్రులను కట్టడి చేసే బలమైన చట్టాలు మన వద్ద లోపించాయి. కేంద్రం తెచ్చిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010 ను చాలా రాష్ట్రాలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో ఆసుపత్రుల ఫీజులను నియంత్రించే ఒక పారదర్శకమైన వ్యవస్థ ఇంకా రూపకల్పన దశలోనే ఉంది. ఈ చట్టపరమైన లొసుగులే ప్రైవేట్ ఆసుపత్రులకు రక్షణ కవచాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం పేదల కోసం ఆరోగ్యశ్రీ (ఏపీ), ఆయుష్మాన్ భారత్ వంటి గొప్ప పథకాలను ప్రవేశపెట్టింది. ఇవి చాలా మందికి ప్రాణదానం చేస్తున్నాయన్నది నిజమే. కానీ వీటి అమలులో కూడా అనేక అవరోధాలు ఉన్నాయి. అన్ని రకాల జబ్బులు ఈ పథకాల్లో కవర్ కావు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్ వంటి ఖరీదైన చికిత్సల్లో సగం దూరం వెళ్ళాక మీ లిమిట్ అయిపోయింది అని హాస్పిటల్స్ చేతులెత్తేస్తున్నాయి.ఆరోగ్యశ్రీ కార్డుతో వచ్చే రోగుల పట్ల కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు చిన్నచూపు చూస్తున్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన రైతు నాగేశ్వరరావు చెప్పినట్లు, డబ్బులు కట్టేవాడికి ఏసీ గది, మాకు మాత్రం పాత వార్డులు. డాక్టర్లు కూడా మమ్మల్ని పట్టించుకోరు. ఆధార్ లింకింగ్, సర్వర్ డౌన్ వంటి కారణాలతో అత్యవసర సమయంలో సేవలు అందక ప్రాణాలు పోతున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఈ మొత్తం వ్యవస్థలో డాక్టర్లను మాత్రమే నిందించడం సరికాదు. చాలా మంది యువ వైద్యులు కార్పొరేట్ సంస్థల ఒత్తిడిలో నలిగిపోతున్నారు. యాజమాన్యాలు వారికి టార్గెట్లు పెడుతున్నాయి. నెలకు ఇన్ని సర్జరీలు చేయాలి, ఇన్ని కోట్లు వసూలు చేయాలి అనే ఒత్తిడి వల్ల, వైద్య నైతికతను (వీవసఇఝశ్రీ జ్‌ష్త్రఱఎం) కాపాడుకోవడం వారికి సవాలుగా మారింది. అయినప్పటికీ, ఒక ప్రాణం ముందు నిలబడినప్పుడు ఆ నైతిక స్పృహను కోల్పోవడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం, ప్రజలు కలిసి పోరాడాలి. ప్రస్తుతం మన దేశంలో జిడిపి లో కేవలం 1.28 శాతం మాత్రమే ఆరోగ్యంపై ఖర్చు చేస్తున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సిఫార్సు ప్రకారం ఇది కనీసం 5 శాతం ఉండాలి. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా మౌలిక వసతులు పెంచాలి. అప్పుడే ప్రైవేట్ హాస్పిటల్స్ గుత్తాధిపత్యం తగ్గుతుంద ప్రతి ఆసుపత్రి తన ఫీజుల వివరాలను డిస్ప్లే బోర్డుపై ఉంచాలి. అనవసర పరీక్షలపై స్వతంత్ర కమిటీల ద్వారా తనిఖీలు జరగాలి పౌర సమాజం మేల్కొనాలి. జన్ స్వాస్థ్య అభియాన్ వంటి సంస్థల ద్వారా రోగుల హక్కుల కోసం ఉద్యమించాలి.

ఆరోగ్యం అనేది మనిషికి పుట్టుకతో వచ్చే హక్కు. అది కేవలం ధనవంతులకు మాత్రమే దక్కే విలాసం కాకూడదు. మార్కెట్ శక్తులు ప్రతిదాన్ని రూపాయల్లో కొలుస్తున్నప్పటికీ, ఒక తండ్రి ప్రాణం లేదా ఒక బిడ్డ చిరునవ్వుకు వెల కట్టలేం. నేడు సావిత్రమ్మ ఇంట్లో జరిగిన విషాదం, రేపు మన తలుపు తట్టవచ్చు. వ్యవస్థను ప్రశ్నించకపోతే, అమానవీయమైన ఈ వైద్య వ్యాపారం మనల్ని నిలువునా దహించివేస్తుంది.గళమెత్తుదాం .ఆరోగ్యాన్ని హక్కుగా సాధించుకుందాం.

## అంబర్‌పేటలో వ్యాపారి కుటుంబం ఆత్మహత్య

**- కేసును ఛేదించిన పోలీసులు**

**- అప్పుల వారి వేధింపులే కారణమని వెల్లడి**




**హైదరాబాద్, మార్చి2( వెలుతురు):**
అంబర్‌పేట్‌లో కుటుంబం ఆత్మహత్య కేసును పోలీసులు ఛేదించారు. గత నెల 24న రామ్‌రాజ్‌తో పాటు అతడి భార్య మాధవి, కుమారుడు శశాంక్ రాజ్ బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. కుటుంబం ఆత్మహత్యకు గల కారణాలను సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి మీడియాకు తెలియజేశారు. అధిక వడ్డీతో హ్యాండ్‌లోన్ తీసుకుని తిరిగి ఇచ్చే వ్యవహారంలో వేధింపులకు గురి చేసిన కారణంగానే కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. 'మృతుడు రామ్‌రాజ్.. మల్లాపూర్, చక్రిపురం ప్రాంతంలో 'కింగ్స్ బిర్యానీ' హోటల్‌ను నిర్వహిస్తున్నారు. హోటల్ నిర్వహణ కోసం పలువురి నుంచి సుమారు 57 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించే విషయంలో అధిక వడ్డీ తీసుకుని, బ్లాక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఒరిజినల్ భూమి డాక్యుమెంట్లు తీసుకుని తీవ్ర వేధింపులకు గురిచేశారు నిందితులు. ఆత్మహత్య చేసుకునే రోజు కూడా వేధింపులు కొనసాగించడంతో మనస్తాపంతో రామ్‌రాజ్ తన భార్య, కుమారుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి కుమార్తె అమూల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు' అని సికింద్రాబాద్ జోన్ డీసీపీ వెల్లడించారు. మృతుడు రాసిన సూసైడ్ నోట్‌లో నలుగురు నిందితుల పేర్లు ప్రస్తావించడంతో పోలీసులు వారిని గుర్తించి అరెస్టు చేశారన్నారు సికింద్రాబాద్ జోన్ డీసీపీ. నిందితులు మహమ్మద్ వాసి, రాజశేఖర్ రెడ్డి, మహమ్మద్ నవాజ్, సయ్యద్ మాజీద్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. హ్యాండ్‌లోన్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి సూచించారు.

## కాకినాడలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**- నిల్వ చేసిన చికెన్, మాంసం గుర్తింపు**

**కాకినాడ,మార్చి2( వెలుతురు):**
కాకినాడలో సీజన్ 5 రెస్టారెంట్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు సహా రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, సివిల్ సప్లైస్ విభాగాల అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. రెస్టారెంట్‌లో వినియోగదారులకు నిల్వ చేసిన మాంసం వడ్డిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో కిలోలకొద్దీ చికెన్, ఫ్రై శాంపిల్స్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. నిల్వ మాంసం కావడంతో అన్నింటినీ సీజ్ చేసినట్లు తెలిపారు. నిల్వ మాంసాన్ని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెస్టారెంట్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటాన్ని కూడా అధికారులు తప్పుబట్టారు. ఈ చర్యలతో రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రత్తిపాడులో జంతుకొవ్వుతో నూనె తయారు చేస్తూ ఓ ముఠా పట్టుబడిన ఘటన మరువకముందే కాకినాడ రెస్టారెంట్ నిర్వాహకుల మోసం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. కాకినాడలోని అనేక హోటల్స్‌లో తరచూ ఆహార కల్తీ జరుగుతోందనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నారు.

## ముస్తాబయిన రాధాకృష్ణుల ఆలయం

**- విభిన్నంగా గిరిజనుల హోలీ జాతర**

**విజయనగరం,మార్చి2( వెలుతురు):**
చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రం బీటాలైన్‌లో గల రాధాకృష్ణుల ఆలయం హోలీ జాతరకు ముస్తాబయింది. ఇక్కడ ఏటా హోలీని విభిన్నంగా జరుపు కుంటారు. తాజంగి పంచాయతీ బీటాలైన్‌లో ఒడిశా నుంచి వలస వచ్చిన 300 కుటుంబాల ఆదివాసీలు సుమారు 85 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. స్థానిక గిరిజనులు గ్రామంలో రాధాకృష్ణుల ఆలయాన్ని నిర్మించి ప్రతి ఏటా హోలీ రోజున పండుగ జరుపుకుంటున్నారు. ఆదివాసీలు ప్రతీ ఏడాది హోలీకి ముందు రోజు నుంచి స్థానిక రాధాకృష్ణుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. హోలీని పురస్కరించుకుని సంప్రదాయంగా భక్తులు ఆలయం ఎదుట 70 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన కర్రల పోగును మంగళవారం కాలుస్తారు. ఆ వేడుకలో స్వయంగా పాల్గొనేందుకు పలు గిరిజన గ్రామాలు, మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆరేళ్ల క్రితం ఆలయాన్ని ఆధునీకరించారు. అయితే బీటాలైన్ ఆదివాసీలు విభిన్నంగా జరుపుకునే హోలీ వేడుక పూర్వం నుంచి కొనసాగుతున్నది. ఈ ఏడాది హోలీ వేడుకలకు రాధాకృష్ణుల ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం రాత్రి



భక్తుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు హోలీ సంబరం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కర్రల పోగును కాల్చే వేడుకను నిర్వహిస్తారు. ఇప్పటికే స్థానిక భక్తులు 70 అడుగుల కర్రల పోగును సిద్ధం చేశారు. ఈ కర్రల పోగును మంగళవారం ఉదయం ఐదు గంటలకు కాలుస్తారు. ఈ కర్రల పోగుపైన ఒక జెండాను తాడుతో ఎగురవేస్తారు. ఈజెండాను పట్టుకోవడానికి కర్రల పోగు చుట్టూ యువ భక్తులు నిరీక్షిస్తుంటారు. ర్రలపోగు కాలిపోయి జెండా గాలిలోకి ఎగురుతుంది. ఈ జెండాను పట్టుకున్న వ్యక్తిని భక్తులందరూ ఎత్తుకుని అతని గృహం వరకూ గిరిజన సంప్రదాయ నృత్య కళాప్రదర్శనలతో తీసుకొస్తారు. జెండాను పట్టుకున్నవ్యక్తికి ఆలయ కమిటీ నగదు బహుమతిగా రూ.1116 అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ జెండాను పట్టుకున్న కుటుంబానికి ఏడాదంతా శుభం జరుగుతుందని స్థానిక భక్తుల నమ్మకం. ఈ ప్రాంత గిరిజనులందరూ ఈ జెండా పట్టుకున్న వ్యక్తితోనే రానున్న ఖరీఫ్ సాగులో తొలి విత్తనాల నాట్లు వేయిస్తారు. జెండా పట్టుకున్న వ్యక్తితో నాట్లు వేయిస్తే అధిక దిగుబడులు వస్తాయనేది ఆదివాసీల విశ్వాసం. బీటాలైన్‌లో ప్రతి ఏటా జరిగే హోలీకి మరో ప్రత్యేకత వుంది. సుమారు 20 ఏళ్ల క్రితం హోలీ పండుగ సమయంలో ఇష్టమైన అమ్మాయి చేయిపట్టుకుని గృహానికి తీసుకువెళితే వారిద్దరికీ వివాహమైనట్లుగా గిరిజనులు భావించేవారు. ప్రతి ఏటా ఈ హోలీ పండుగ సమయంలో సుమారు 20 - 30 జంటలు చేయి పట్టుకునే పద్ధతిలో కలిసేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మహిళా చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడం, చట్టాలను మరింత కఠినతరం చేయడంతో ఈ చేయిపట్టుకుని తీసుకువెళ్లే ఆచారానికి స్థానిక గిరిజన యువత పూర్తిగా స్వస్తి పలికింది.

## మార్చి 3న చంద్రగ్రహణం

**- తిరుమలతో పాటు టిటిడి ఆలయాల మూత**

**తిరుపతి,మార్చి2( వెలుతురు):**
చంద్రగ్రహణం కారణంగా మంగళవారం తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తారు. తిరిగి బుధవారం వేకువ



జామున సంప్రోక్షణ అనంతరం తెరుస్తారు. అలాగే ఉదయం తిరుపతి, పరిసర ప్రాంతాల్లోని టిటిడి స్థానికాలయాలను మార్చి 3వ తేది మూసివేస్తారు. తిరిగి మార్చి 3వ తేది రాత్రి ఆలయాల తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మార్చి 3వ తేది మంగళవారం మధ్యాహ్నం 3.20 నుండి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయం, శ్రీ శ్రీనివాస ఆలయాలను మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 గంటలకు తలుపులు తెరుస్తారు. శుద్ధి, పుణ్యహావచనం ఇతర కైంకర్యాల అనంతరం సర్వదర్శనానికి అనుమతిస్తారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 తెరిచి, శుద్ధి, పుణ్యహావచనం ఇతర కైంకర్యాల అనంతరం రాత్రి 9 గంటలకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం, అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యహావచనం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. నారాయణవనంలోని శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి, కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి, నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి, బుగ్గలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సత్రవాడలోని శ్రీ కరివరదరాజస్వామి ఆలయం, నగరిలోని శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేసి, రాత్రి 7:30 గంటలకు తెరుస్తారు. ఆలయ శుద్ధి, పుణ్యహావచనం తదితర సేవల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం, వాయల్పాడులోని శ్రీ పట్టాభిరామస్వామి ఆలయం, కోసువారిపల్లిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేసే రాత్రి 7:30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు.

## గల్ఫ్‌లో చిక్కుకున్న వారి కోసం హెల్ప్‌లైన్

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి**

**అమరావతి,మార్చి2( వెలుతురు):**
ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తామని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి, ఏపీఎన్నార్టీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. అందుకోసం చర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు.

సోమవారం అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారికి ఏపీఎన్నార్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అలాగే తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు వినియోగించుకోవాలంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి సూచించారు. తమ సమస్యలు.. ఏపీఎన్నార్టీఎస్ హెల్ప్‌లైన్ నెంబర్ 0863-2340678కు చెప్పొచ్చని తెలిపారు. ఈ నెంబర్ వారంలో ఏడు రోజులు.. 24 గంటలు సైతం పని చేస్తుందని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ ?91 85000 27678 సమస్యలు చెప్పొచ్చంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి వివరించారు. ఇక ఈ-మెయిల్: ద।÷ఞ్గ÷తిని।అజూనిసబిబ.ఞనీపను సంప్రదించవచ్చు వారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

వెలుతురు



# ఉగాదికి విశ్వంభర స్పెషల్ గ్లింప్స్

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు వశిష్ఠ ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తుండగా,యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, ఛాయాగ్రహణ బాధ్యతలు చోటా కే నాయుడు నిర్వహిస్తున్నారు. విజువల్‌గా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతోంది. షూటింగ్ పూర్తయినప్పటికీ 'విశ్వంభర' విడుదల కొంతకాలంగా వాయిదా పడుతోంది. ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని తెలుస్తోంది. అత్యున్నత స్థాయి సీజీ వర్క్ అవసరం కావడంతో ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ సమయం తీసుకుంటున్నారు. టీజర్‌లోని కొన్ని గ్రాఫిక్స్‌పై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలను సీరియస్‌గా తీసుకుని రీ-వర్క్ కూడా చేపట్టినట్లు సమాచారం. ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్‌కే దాదాపు రూ.75 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారనే వార్తలు ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఉగాది సందర్భంగా 'విశ్వంభర' స్పెషల్ గ్లింప్స్ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే గ్లింప్స్‌తో పాటు అధికారిక రిలీజ్ డేట్ ప్రకటించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీజర్‌తో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రం, కొత్త గ్లింప్స్‌తో అంచనాలను మరింత పెంచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విషయానికి వస్తే, 'విశ్వంభర' 14 లోకాల కాన్సెప్ట్ చుట్టూ తిరిగే ఫాంటసీ అడ్వెంచర్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణికంగా చెప్పబడే ఊర్ధ్వ లోకాలు, అధో లోకాల నేపథ్యంతో కథ సాగుతుందని, వీటికి మించి ఉన్న 'విశ్వంభర' అనే ప్రత్యేక లోకాన్ని చేరుకోవడానికి హీరో చేసే సాహస యాత్ర ప్రధాన కథాంశమని ప్రచారం. ఈ స్టోరీ లైన్ మెగా అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ థియేట్రికల్ ట్రైలర్ ఇప్పటికే సిద్ధంగా ఉందని తెలిపారు. టీజర్‌లో చూసిన విజువల్స్‌తో పోలిస్తే ట్రైలర్ పూర్తిగా భిన్నంగా, మైండ్ బ్లోయింగ్ అనుభూతిని ఇస్తుందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. టీజర్‌పై వచ్చిన విమర్శలకు ట్రైలర్‌తో గట్టి సమాధానం ఇవ్వాలన్నదే యూనిట్ లక్ష్యమని తెలుస్తోంది.






# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.







# ఉస్తాద్ నుంచి పవన్ మరో లుక్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ హరీష్ శంకర్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్నది. ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన దేఖ్ లేంగే సాలా, సాంగ్స్ నెట్టింట వైరల్ అవుతున్నారు. మేకర్స్ ఏదో ఒక ప్రమోషనల్ మెటీరియల్ రిలీజ్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన లుక్‌లో ఉస్తాద్ భగత్ సింగ్‌గా పవన్ కల్యాణ్ తన దైన స్టైల్‌లో చైర్‌పై కూర్చొని ఛిల్ అవుట్ మూడ్‌లో ఉండటం చూడొచ్చు. ఈ స్టిల్ చూస్తుంటే అభిమానులు ఆశించే ఎంటర్‌టైన్‌మెంట్ ఉస్తాద్ భగత్ సింగ్‌లో పుష్కలంగా ఉండబోతున్నట్టు హరీష్ శంకర్ హింట్ ఇచ్చేస్తున్నాడు. తాజా లుక్ అభిమానులు, మూవీ లవర్స్‌లో మరింత హైప్ పెంచేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి.గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.




# సొంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు

## తులసిపూజ..సత్యనారాయణస్వామి వ్రతం



వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.0

# పెద్ది రెండో సింగిల్ విడుదలకు సిద్ధం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' రెండో సింగిల్ 'రాయ్ రాయ్ రా రా' విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. తొలి పాట 'చికిరి చికిరి'కి మంచి స్పందన లభించిన నేపథ్యంలో రెండో సాంగ్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి ఎలాంటి ప్రోమో విడుదల చేయకపోవడంతో పాట రిలీజ్ టైమ్‌పై కొంత గందరగోళం నెలకొంది. తాజా అప్‌డేట్ ప్రకారం 'రాయ్ రాయ్ రా రా' పాటను మంగళవారం సాయంత్రం 7:02 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ టైమ్‌ను కన్ఫర్మ్ చేస్తూ చరణ్‌కి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో చరణ్ మాస్ అవతార్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ పాట మోటివేషనల్ టచ్‌తో కూడిన మాస్ నంబర్‌గా ఉండనుంది. ముఖ్యంగా చరణ్ డాన్స్ మూవ్స్ ఈ సాంగ్‌కు హైలైట్ అవుతాయని టాక్. తన ఎనర్జీ, గ్రేస్‌తో చరణ్ మరోసారి అభిమానులను అలరించనున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ సాంగ్‌పై భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.




# టాక్సిక్‌లో తబాహి సాంగ్ విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం యష్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుందనే విశ్వాసం అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై హైప్‌ను అమాంతం పెంచేసింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'తబాహి'ను మేకర్స్ విడుదల చేశారు. అయితే కేవలం ఆడియో రూపంలో మాత్రమే సాంగ్ విడుదల కావడంతో ఫ్యాన్స్ కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. విజువల్ ప్రెజెంటేషన్ కోసం ఎదురు చూసిన అభిమానులకు లిరికల్ లేదా వీడియో సాంగ్ రాకపోవడం చిన్న నిరుత్సాహమే అయినప్పటికీ, పాట మాత్రం మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ సాంగ్‌ను పాన్ ఇండియా స్థాయిలో అన్ని ప్రధాన భాషల్లో విడుదల చేశారు. తెలుగులో ఈ పాటకు ప్రముఖ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు విశాల్ మిశ్రా స్వరపరచి స్వయంగా ఆలపించారు. మ్యూజిక్‌లో యాక్షన్ మూడ్, ఎమోషనల్ అండర్‌టోన్ కలగలిపిన శైలి కనిపిస్తోందని సంగీత ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. 'టాక్సిక్'లో యష్‌కు జోడీగా కియారా అద్వాని నటిస్తుండగా, కీలక పాత్రల్లో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, టోవినో థామస్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'తబాహి' సాంగ్‌తో 'టాక్సిక్' మ్యూజికల్ జర్నీ ప్రారంభమైంది. త్వరలో విజువల్ సాంగ్ విడుదలైతే అంచనాలు మరింత పెరగడం ఖాయం.

# కుువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

**- తామే కూల్చామని ఇరాన్ ప్రకటన**

**కువైట్, మార్చి2( వెలుతురు):**

అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన దాడులను కొనసాగిస్తోంది. కువైట్ ఇంటిగ్రేటెడ్ పెట్రోలియం ఇండస్ట్రీస్ కంపెనీ సోమవారం విమానం శిథిలాలు మినా అల్ అహ్మది శుద్ధి కర్మాగారంలోకి పడ్డాయని ధృవీకరించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారని కిపిక్ తెలిపింది. ఈ ప్రాంతంలో మోహరించిన ఎంఐఎం-104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ ద్వారా విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయిందని అనుమానిస్తున్నారు. పేట్రియాట్ అనేది బాలిస్టిక్ క్షిపణులు, శత్రు విమానాలను



కూల్చివేసేందుకు సాధారణంగా ఉపయోగించే అధునాతన వ్యవస్థ. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా వైమానిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్ తదితర దేశాల్లోని అమెరికా బేస్‌లపై దాడులు చేసింది. కాగా, సోమవారం శత్రు దేశానికి చెందిన ఓ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న ఒక ఎఫ్-15ఏ÷టైర్ జెట్‌ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడుదల చేసింది. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. ఓ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకుని నెమ్మదిగా కిందకు పడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విమానం అమెరికాదా లేక ఇజ్రాయెల్‌దా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పైలట్లు ఇద్దరు పారాచూట్ల సాయంతో క్షేమంగా బయటపడినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రికత్తలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇరాన్, అమెరికా మద్దతు కలిగిన ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ప్రారంభించింది

## కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

**- బాంబు దాడిలో ధ్వంసమైన గాంధీ ఆస్పత్రి**

**- 165కు చేరుకున్న పాఠశాల దాడి మృతులు**



**టెహ్రాన్, మార్చి2( వెలుతురు):**

అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లో ఉన్న గాంధీ హాస్పిటల్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో భవనం చాలా వరకు దెబ్బతింది. బాంబుల తాకిడికి కిటికీలు పగిలిపోయి, వార్డుల నిండా శిథిలాలు పేరుకుపోయాయి. దట్టమైన పొగలు వెలువడటంతో హాస్పిటల్ లో ఉన్న రోగులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్ యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. ఓ వైపు బాంబు దాడులు జరుగుతున్నా నర్సులు తమ ప్రాణాలకు తెగించి ఇన్సులేటర్లలో ఉన్న నవజాత శిశువులను, ఐసీయూలోని చిన్నపిల్లలను చేతులతో పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ స్పందించారు. ఆసుపత్రులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఇలాంటి దాడులను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇదిలావుంటే ఇరాన్‌లోని మినాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రాథమిక పాఠశాలపై ఇజ్రాయిల్ దాడిలో మరణించిన వారి సంఖ్య 165కి పెరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్‌లోని షాజారే తయ్యిబె బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఈ దాడి జరిగింది. 96 మంది గాయపడ్డారని ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ నివేదించింది. దాడి జరిగిన ప్రదేశంలో శోధన, రక్షణ చర్యలు ముగిశాయని మినాబ్ కౌంటీ గవర్నర్ తెలిపారు. బాలికల పాఠశాలపై దాడి వార్తలను ఇజ్రాయిల్ ఖండించింది. నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ట్విట్టర్‌లో దాడికి సంబంధించిన ఫోటోను పంచుకున్నారు. ఇజ్రాయిల్, అమెరికా శనివారం ఇరాన్‌పై ఉమ్మడి దాడిని ప్రారంభించాయి. ఈ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరియు ఇతర సీనియర్ సైనిక అధికారులు మరణించారు.

## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

**- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన**



**వాషింగ్టన్, మార్చి2( వెలుతురు):**

ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగు, ఐదు వారాలు జరగొచ్చని, ఆ యుద్ధం ముగిసేలోపు మరింత మంది ఎక్కువ అమెరికా సైనికులు మృతి చెందే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మరికొద్ది రోజుల పాటు పూర్తి స్థాయిలో కొనసాగుతుందన్నారు. అలాగే అమెరికా సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. యుద్ధం ముగిసేలోపు మరింత మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. అయినా ముందుకే వెళ్తాం. ఈ దాడుల వల్ల ఇరాన్‌లో 200 మంది మరణించినట్టు తెలిసింది. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పించేందుకు సిద్ధం. లేదంటే వారికి చావు తప్పదు. అలాగే చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు . అలాగే తనపై జరిగిన హత్యాయత్నాల గురించి కూడా ట్రంప్ స్పందించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై ఇప్పటికి రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథను ముగించా. నన్ను పట్టుకోకముందే, నేను అతడిని పట్టుకున్నా. ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. ఆ ఆపరేషన్ 4-5 వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదే విధంగా కొనసాగించడం అమెరికా, ఇజ్రాయెల్‌కు పెద్ద కష్టం కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

## స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

**- తీవ్రంగా నష్టపోయిన సూచీలు**

**ముంబయి, మార్చి2( వెలుతురు):**



ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు రేట్ల పెరుగుదలతో సూచీలు దారుణంగా పడిపోయాయి. సెన్సెక్స్ 1000 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 300 పాయింట్ల మేర పడిపోయింది. సోమవారం ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారింది. దీంతో 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గింది. దీంతో 91.32గా ట్రేడ్ అవుతోంది. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందారు. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నప్పటికీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇరాన్-అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రేట్లు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైగా ట్రేడ్ అవుతోంది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు బాగా పడిపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5 శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

## లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడి

**బీరూట్, మార్చి2( వెలుతురు):**

లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడి చేసింది. లెబనాన్‌లోని దాదాపు 50 గ్రామాల ప్రజలను ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం కోరింది. ఆ తర్వాత ఇరాన్ గల్ఫ్ దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకారం తీర్చుకుంది. బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇరాన్ క్షిపణి మరియు డ్రోన్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ హత్య, పునరావృత ఇజ్రాయిల్ దురాక్రమణలకు ప్రతీకారంగా లెబనాన్ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ సరిహద్దు దాటి క్షిపణులు ప్రయోగించింది. ఈ మేరకు హెజ్బుల్లా ఒక ప్రకటనను విడుదల చేసింది. ఒక సంవత్సరానికి పైగా కాలం తర్వాత హెజ్బుల్లా ఇజ్రాయిల్‌పై దాడి చేసినట్లు ప్రకటించుకోవడం ఇదే తొలిసారి. ఈ దాడిలో ఒక ప్రక్షేపకాన్ని అడ్డుకున్నామని, మరికొన్ని బహిరంగ ప్రదేశాల్లో పడ్డాయని ఇజ్రాయిల్ రక్షణ దళాలు తెలిపాయి. ఈ ఘటనల్లో ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. 2024లో అమెరికా



మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీని ద్వారా ఇజ్రాయిల్ మరియు హెజ్బుల్లా మధ్య ఏడాదికిపైగా కొనసాగిన ఘర్షణలకు ముగింపు పలికింది. ఆ సమయంలో ఇజ్రాయిల్ దాడులు హెజ్బుల్లాను గణనీయంగా బలహీనపరిచినట్లు విశ్లేషకులు భావించారు. అయితే, అప్పటి నుంచి ఒప్పంద ఉల్లంఘనలపై ఇరుపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా, బీరూట్ దక్షిణ శివార్లలో వేలాది హెజ్బుల్లా మద్దతుదారులు ఇరాన్ సుప్రీం నాయకుడికి నివాళులర్పించారు.

## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

**- శంషాబాద్ నుంచి పలు విమానాల రద్దు**



**హైదరాబాద్,మార్చి2( వెలుతురు):**

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ నుంచి విదేశాలకు వెళ్లాల్సిన అనేక విమానాలు రద్దయ్యాయి. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా విమానాయన సంస్థలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దోహా, అబుదాబి, జెడ్డా, సౌదీ అరేబియా వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. అలాగే కువైట్, దుబాయ్, మస్కట్, మదీనా వెళ్లే సర్వీసులు కూడా తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన సుమారు 22 విమానాలు రద్దు కాగా, వివిధ దేశాల నుంచి రావాల్సిన మరో 22 విమానాలు కూడా రద్దయ్యాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎమిరేట్స్, కతార్ ఎయిర్‌వేస్ వంటి విమానయాన సంస్థలు విమానాలను రద్దు చేశాయి. విమానాల రద్దుతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాలు ప్రయాణికుల లేక వెలవెలబోతున్నాయి. ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక సూచన జారీ చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని...ఏ÷÷-లట్ స్టేటస్‌ను ఎయిర్‌లైన్ వెబ్‌సైట్‌లు, ఎయిర్‌పోర్ట్ అధికారుల ద్వారా తెలుసుకోవాలని డీజీసీఏ సూచించింది.

## ఇరాన్ దాడులతో బిక్కుబిక్కుమంటున్న దుబాయ్

**- వరుస డ్రోన్ దాడులతో ప్రజల్లో భయాందోళనలు**

**అబుదాబి, మార్చి2( వెలుతురు):**

పర్యాటకులు, ధనవంతులు, వ్యాపారాలకు స్వర్గధామంగా గుర్తింపు పొందిన దుబాయి నగరం ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిపోయింది. శనివారం నుంచి క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు చేస్తున్న ఇరాన్.. ఆదివారం కూడా దాడి చేసింది. ఈ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని దుబాయి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిత్యం ప్రశాంతంగా ఉండే నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు, మంటలు, ఆకాశంలోకి లేస్తున్న దట్టమైన పొగ.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. చాలామంది స్థానికులు, పర్యాటకులు దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని చెప్పారు. ముందుజాగ్రత్తగా ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లన్నింటినీ కూల్చివేశామని ప్రకటించింది. అయితే, జెబెల్ అలీ పోర్టు సమీపంలో ఇరాన్ ప్రయోగించిన ఓ డ్రోన్ పడి భారీగా మంటలు చెలరేగాయి. దుబాయి గగన రక్షణ వ్యవస్థ కూల్చివేసిన ఇరాన్ డ్రోన్ శకలాలు పడటంతో పామ్ హోటల్‌లో స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని, వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇరాన్ దాడితో దుబాయిలోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందిన బుర్జ్ ఖలీఫా, బుర్జ్ అల్ అరబ్‌లకు ముప్పు ఏర్పడింది. శనివారం రాత్రి ఇరాన్ డ్రోన్ శకలాలు బుర్జ్ అల్ అరబ్ భవనాన్ని తాకటంతో అది స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ముందు



జాగ్రత్తగా ఈ రెండు భవనాలను అధికారులు ఖాళీ చేయించారు. ఆదివారం తెల్లవారుజామున మూడు భారీ పేలుళ్లు వినిపించాయని స్థానికులు చెప్పారు. కృత్రిమంగా సృష్టించిన విలాసవంతమైన పామ్ జుమైరా దీవిలో కూడా డ్రోన్ పడటంతో మంటలు చెలరేగాయి. కాగా, నగరంలో పరిస్థితి అంతా మామూలుగానే ఉందని దుబాయి మీడియా కార్యాలయం ప్రకటించింది. అత్యవసర వైద్యసేవల కోసం దుబాయిలో 1,200 పడకల రషీద్ ప్రభుత్వాసుపత్రిని సిద్ధం చేసినట్లు అక్కడ సేవలందిస్తున్న ఓ భారతీయ వైద్యుడు చెప్పారు. 400మంది నర్సింగ్ సిబ్బంది, 200మందికిపైగా వైద్యులను ఉంచినట్లు తెలిపారు. నగరంలో వందలకొద్ది అంబులెన్సులను సిద్ధంగా ఉంచారని అన్నారు. దుబాయిలో పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ఆదివారం మధ్యాహ్నానికి పేలుళ్లు పెరిగాయి. అయినా పరిస్థితి అదుపులోనే ఉంది. సామాన్య జనజీవనానికి పెద్దగా అంతరాయాలు ఏమీ లేవు. ఇళ్లకే పరిమితమయ్యాం. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతున్నా, ఇక్కడి ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది. యూఏఈ ఇప్పటికే ఎన్నో జాగ్రత్త చర్యలు చేపట్టింది.

## నేడు చంద్రగ్రహణంతో యాదాద్రి ఆలయం మూసివేత

**యాదగిరిగుట్ట,మార్చి2( వెలుతురు):**

ఈ నెల 3న సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ప్రధానాలయంతో పాటు ఉపాలయాలు, అనుబంధ దేవాలయాలలో ఉదయం 7 గంటలలోపు సుప్రభాత, నిజాభిషేకం, అర్చనలు ముగించి మూసివేస్తామని వెల్లడించారు. 4వ తేదీన ఉదయం 3 నుంచి 5.30 గంటల వరకు ప్రధానాలయంతో పాటు ఉపాలయాలను తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సుప్రభాతం, తిరువారాధన, బాలబోగం, ఆరగింపు, నిజాభిషేకం నిర్వహించి, ఉదయం 8.45 గంటలకు ఉభయ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు. చంద్రగ్రహణం సందర్భంగా స్వామివారి సన్నిధిలో రేపు జరిగే హోలికోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహిస్తామని ప్రకటించారు.

## రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

**- నేలపాడులో నిర్మాణాల పరిశీలన**

**అమరావతి,మార్చి2( వెలుతురు):**

వైసిపి ప్రభుత్వం అవలంబించిన మూడు ముక్కలాట ధోరణితో అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ లక్ష్యానికి అనుగుణంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. సోమవారం మంత్రి రాజధాని అమరావతిలో పర్యటించారు. నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1, టైప్ -2, గ్రూప్ డి



ఉద్యోగుల క్వార్టర్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, మొత్తం 4,026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయని చెప్పారు. అమరావతిలో ప్రైవేట్ సంస్థలు కూడా నిర్మాణ పనులు ప్రారంభించాయన్నారు.నిర్మాణ సంస్థలు తమకు నిర్దేశిరచిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేశాయని, టార్గెట్ ప్రకారం పనులు చేయని షాపూర్జీ పల్లోంజి నిర్మాణ సంస్థ మేనేజ్ మెంట్ తో మాట్లాడుతున్నామని మంత్రి చెప్పారు. షాపూర్జీ పల్లోంజి యాజమాన్యం 5 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా 'వేతనాల చెల్లింపు పై ఎలాంటి సమస్యా లేదని, కార్మికులు మంచినీరు కోసం ఆందోళన చేయగా సమస్యను పరిష్కరించడం..' జరిగిందని అన్నారు.ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో వైసిపి ప్రభుత్వం తనపై కూడా కేసులు పెట్టిందని మంత్రి చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ లో 2001 లో తనకు చెందిన 60 సెంట్ల స్థలం కూడా పోయిందని, విజయవాడ సమీపంలో ఈడుపుగల్లులో ఉన్న తన స్థలం గుండా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుందని చెప్పారు. మా వాళ్ళు బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సి ఆర్ డి ఎ అధికారులు మీ స్థలం లేదని చెప్పారన్నారు. కేసు కోర్టులో ఉన్నందున తాను ఎలాంటి వ్యాఖ్యానాలు చేయనున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com